PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 202 | విజయవాడ, ఆదివారం 23 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 23 February 2025 | Rs

దేశంలో నయాఫాసిజం ధోరణులు

- లౌకిక శక్తుల విశాల ఐక్యత చాలా అవసరం
- పార్టీ స్వతంత్ర బలం.. వామపక్షాల ఐక్యత బలోపేతం
- సిపిఎం పశ్చిమ బెంగాల్ మహాసభలో ప్రకాశ్ కరత్

7



నేడు భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య కీలక పోరు

- ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ

8

టన్నెల్‌లో ప్రాణాలు

• కూలిన సొరంగం • చిక్కుకున్న ఎనిమిదిమంది

• కొనసాగుతున్న సహాయక చర్యలు • రంగంలోకి ఆర్మీ



ప్రమాదం జరిగిన ఎస్‌ఎల్‌బిసి సొరంగం (ఇన్‌సెట్‌లో) సహాయక చర్యల బృందం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎల్‌ఎస్‌బిసి సొరంగం పనుల్లో శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో భారీ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా టన్నెల్ కూలడంతో ఎనిమిదిమంది కార్మికులు చిక్కుకున్నారు. రాత్రి పొద్దుపోయేంత వరకూ వీరిని వెలికితీసే ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రమాద సంఘటనపై ఆరా తీశారు. అంతకుముందు శనివారం ఉదయం టన్నెల్ పైకప్పు మూడు మీటర్ల మేర కుప్పకూలింది. ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని రక్షించిన తోటి కార్మికులు హుటాహుటిన జెన్‌కో ఆస్పత్రికి తరలించారు. సొరంగంలోని రింగ్‌లు కిందపడడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తోటి కార్మికుల కథనం ప్రకారం... ఉదయం షిఫ్ట్‌లో 40 మంది కార్మికులు పనిలోకి వెళ్లారు. ప్రమాదం అనంతరం సొరంగం నుంచి ఒక్కొక్కరిగా బయటకు రాగా.. ఎనిమిది మంది గల్లంతయ్యారు. ఘటనా స్థలం వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. సొరంగమంతా చీకటిగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. నల్లగొండ జిల్లాకు తాగునీరు, సాగునీరు ఇచ్చేందుకు ఐదేళ్ల విరామం తర్వాత శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు కెనాల్ నుంచి అమ్రాబాద్ మండలం దోమలపెంట మండలం దోమలపెంట ఎస్‌ఎల్‌బిసి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వరకు 43 కిలోమీటర్ల సొరంగం పనులు ఈ నెల 18న ప్రారంభమయ్యాయి. ఈ సొరంగంలో రోజు మాదిరిగానే 50 మంది కార్మికులు పనిలో ఉన్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా 14వ కిలోమీటరు వద్ద సొరంగంలోనిపై మట్టి దిమ్మెలు కూలిపడ్డాయి. నీరు లోనికి ప్రవేశించింది. ఈ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది కార్మికుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విషయం తెలిసిన వెంటనే మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్, జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సొరంగ మార్గంలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు చేపట్టాలని, ఆక్సిజన్ అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక సిబ్బంది, రిస్క్ టీములు రంగంలోకి దిగాయి.

గల్లంతైంది వీరే..

మనోజ్ కుమార్, శ్రీనివాస్ (ఉత్తరప్రదేశ్), సందీప్ సాహు, జటాక్స్, సంతోష్ సాహు, అనూజ్ సాహు, (జార్ఖండ్), సన్నీ సింగ్ జమ్మూకాశ్మీర్, గురుప్రీత్ సింగ్ 'పంజాబ్)

తెలంగాణ ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

ఈ ప్రమాదం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అధికారులను, మంత్రులను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి మిగతా 7లో



విశాఖ ఇసుకతోట జంక్షన్ వద్ద శనివారం రాత్రి రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

గ్రూపు -2 పరీక్ష నేడే

•ఎపిపిఎస్‌సి ప్రకటన •భగ్గుమన్న నిరుద్యోగులు

- విశాఖతో పాటు పలుచోట్ల నిరసనలు
- ప్రభుత్వ వైఖరితో గందరగోళం
- గ్రాడ్యుయేట్ ఎన్నికల లబ్ధికోసం టిడిపి ప్రయత్నం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరుద్యోగుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ గ్రూపు-2 పరీక్షను నేడు (ఆదివారం) నిర్వహించడానికే ఎపిపిఎస్‌సి సిద్ధమైంది. ఈ మేరకు శనివారం సాయంత్రం అధికారికంగా ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం వరకు కూడా పరీక్ష ఉంటుందో, ఉండదో అన్న సందిగ్ధత కొనసాగింది. టిడిపి నేతలతో జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారని, పరీక్షను వాయిదా వేయాలని ఎపిపిఎస్‌సికి సూచించినట్లు ఆయన స్వయంగా చెప్పారని మీడియాలో వార్తలు వచ్చాయి . ఎంఎల్‌సి ఎన్నికల బరిలో ఉన్న టిడిపి అభ్యర్థులు తమ చొరవతో పరీక్ష వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. దీంతో ఆదివారం పరీక్ష జరగదన్న అభిప్రాయమే రాష్ట్ర వ్యాప్తంగా గ్రూపు-2 అభ్యర్థుల్లో మిగతా 7లో

జెన్‌కోను ప్రైవేటీకరించండి

- కేంద్రం ఒత్తిడి ... సానుకూలంగా రాష్ట్రం
- వ్యతిరేకిస్తున్న అధికారులు
- మర్చంట్ బ్యాంకర్ నియామకానికి చర్యలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్కరణల్లో భాగంగా జెన్‌కోను ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ప్రైవేటీకరణలో భాగంగా జెన్‌కోను స్టాక్ మార్కెట్‌లోకి తీసుకురావాలని, షేర్లను విక్రయించాలని కేంద్రం సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుండి అధికారికంగానే సమాచారం అందింది. దీనిపై అధికారయంత్రాంగంలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర నుంచి ఎపిజెన్‌కో ఉత్పత్తి సామర్థ్యం పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ఈ సంస్థపై కేంద్రం కన్ను పడిందని చెబుతున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో జెన్‌కోను లిస్ట్ చేస్తే, నిధులు, ఇతర వనరుల సమీకరణ మరింత సులభమవుతుందని, తద్వారా సంస్థ మరింతగా అభివృద్ధి చెందుతుందని కేంద్రం చెబుతున్నట్లు సమాచారం. అయితే, ఈ ప్రతిపాదనను విస్తృతంగా చర్చించిన ఉన్నతాధికారులు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన పలు అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే, అధికారుల అభిప్రాయాలు ఎలా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కీలకమన్న సంగతి తెలిసిందే.

అయితే, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకుంటుండటం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ సంస్కరణలకు తానే ఆద్యుడినని పదేపదే చెప్పుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జెన్‌కో ప్రైవేటీకరణ పట్ల కూడా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. దీనిలో భాగంగానే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టెడ్ చేయించడానికి మర్చంట్ బ్యాంకర్‌ను నియమించే దిశలో చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి పంకజ్ అగర్వాల్ ఢిల్లీలో మీడియాకు తెలిపారు.

దేశంలో మరో నాలుగు డిస్కామ్‌లు..

ఆంధ్ర ప్రదేశ్‌లో జెన్‌కోను ప్రైవేటీకరించాలని ఒత్తిడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మరో నాలుగు రాష్ట్రాల్లో పంపిణీ సంస్థ(డిస్కమ్)లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టు చేయాలని ఆదేశించింది. ఈ జాబితాతో గుజరాత్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ కూడా ఉంది. దేశ వ్యాప్తంగా అనేక డిస్కామ్‌లు నష్టాల్లో ఉండటంతో ఈ చర్య తప్పనిసరని కేంద్రం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల మిగతా 7లో

రూ.11,781 కంటే తగ్గితేనే...

- మిర్చికి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం
- కేంద్రం అంగీకరిస్తే అమలు : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిర్చి ధర క్వింటాకు రూ.11,781 కంటే తక్కువగా ఉంటే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద కేంద్రం కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని ప్రతిపాదనలు పంపినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50 శాతం భరించాల్సి ఉందని తెలిపారు. సచివాలయంలో మిర్చి రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులు, అధికారులతో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2017లో ధరలు పతనమైనప్పుడు క్వింటాకు రూ.1,500 అందించామని, ఇందుకోసం రూ.135 కోట్లు ఖర్చు చేశామన్నారు. ధరలు పతనమై ఇబ్బందులు పడుతున్న మిర్చి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎగుమతిదారులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఇందుకు సహకరించాలని కోరారు. మిర్చి రైతులు ఇబ్బందులపై గత ఏడాది డిసెంబరు 26, ఈ ఏడాది ఫిబ్రవరి 5, 11 తేదీల్లో కేంద్రానికి లేఖలు రాశానని తెలిపారు. మిర్చి యార్డులో టిక్కిలు కాటా వేసిన వెంటనే రైతులకు మెసేజ్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోల్డ్ స్టోరేజిలో మిర్చి టిక్కిలు నిల్వ చేసుకున్న రైతులకు బాండ్ల ఆధారంగా రుణాలు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. గుంటూరు స్పైసెస్ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ-క్రాఫ్‌లో నమోదైన రైతుల వివరాలు, యార్డుల్లో పంటను అమ్ముకుని రికార్డుల్లో నమోదైన వివరాల ఆధారంగా రైతులకు సాయం అందించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. రాష్ట్రంలో మామిడి, మిర్చి బోర్డుల ఏర్పాటుకు కేంద్రంతో చర్చిస్తామని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం, అధికారులతో మాట్లాడి మిర్చి కంటైనర్ల రవాణాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

చితికిన చిన్న షేర్లు

- 400 స్టాక్స్ 53 శాతం మేర పతనం
- టారిఫ్ దెబ్బలకు విలవిల
- రిటైల్ ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు

3

ట్రంప్ వ్యాఖ్యల చిచ్చు

- భారత్‌కు అమెరికా నిధులపై బిజెపి, కాంగ్రెస్ మాటల యుద్ధం
- ట్రంప్, ఎలన్ మస్క్ మాటలను నమ్మొద్దు : బృందాకరత్

7

భారీ భద్రత మధ్య అసెంబ్లీ

- రేపటి నుండి సమావేశాలు
- ప్లకార్డులు, బ్యానర్లు నిషేధం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సోమవారం నుండి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు భారీ భద్రత కల్పించనున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులను మొహరించడంతో పాటు అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ శనివారం సాయంత్రం బులిటెన్ విడుదల చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాలను ఏర్పాటుచేస్తున్నట్టు ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నిర్ధేశించిన వ్యక్తులు తప్ప ఇతరులు ఆ గేట్ల నుండి లోనికి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాస్‌లు లేని వారిని కూడా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఒకటో గేట్ నుంచి కేవలం ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రులకు మాత్రమే ప్రవేశం ఉంటుంది. రెండో గేట్ నుంచి మంత్రులకు, నాలుగో ద్వారం నుంచి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ప్రవేశం ఉంటుంది. మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, ముఖ్యమంత్రి పేషీల వద్ద కారిడార్లలోలో ఎవరిని అనుమతించేది లేదని పేర్కొన్నారు. సభ్యులు, మంత్రులకు ఉన్న గన్‌మెన్లు కూడా గన్‌మెన్ పాయింట్ ద్వారా ముందుకు అనుమతించకుండా ఆంక్షలు విధించారు. శాఖల నుంచి వచ్చే సిబ్బంది కూడా ఎక్కడ పడితే అక్కడ తిరుగకుండా ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. సభ్యులు తమ సొంత ఆయుధాలను కూడా సభా ప్రాంగణంలోకి తీసుకురాకూడదని స్పష్టం చేశారు.

వారి ఆయుధాలను తీసుకువస్తే వాటిని సభ్యుల సర్వీస్ కౌంటర్ వద్ద ఏర్పాటుచేసిన బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో డిపాజిట్ చేయాలని నిర్దేశించారు. అలాగే బ్యానర్లు, లాఠీలు, కర్రలు, ప్లకార్డులు, విజిల్స్ వంటివి కూడా పూర్తిగా నిషేధిస్తున్నట్లు అందులో స్పష్టం చేశారు. సభలో సభ్యులు స్లోగన్లు ఇవ్వడం, పాంప్లెట్లు, ఇతర కాగితాలను ప్రదర్శించడంపైనా నిషేధం విధించారు. శాసనసభ, శాసనమండలి పరిధిలో సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, పికెటింగ్‌లపైనా నిషేధాన్ని విధించారు.

విజిటర్లపైనా ఆంక్షలు

శాసనసభ సమావేశాల సందర్భంగా శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు ఎవరూ సందర్శకులను తీసుకురాకూడదని కూడా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమవు తాయని బులిటిన్‌లో పేర్కొన్నారు. సభ్యులు తమ పిఎస్, పిఎ వంటి వ్యక్తిగత సిబ్బందిని కూడా సభా ప్రాంగణానికి తీసుకురావద్దని స్పష్టం చేశారు.

మీడియా పాస్‌ల కుదింపు

సమావేశాలను కవర్ చేసేందుకు వచ్చే మీడియాను కూడా కుదించే చర్యలు తీసుకున్నారు. గత సమావేశాల కన్నా కూడా తక్కువగా పాస్‌లు ఇవ్వాలని నిర్ణయించారు.

28న మంత్రివర్గ సమావేశం

సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు సిఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రివర్గ సమావేశంలో 2025-26 బడ్జెట్‌ను కేబినెట్ ఆమోదించనుంది.

భారత్‌లో పర్యటించనున్న ఇయు అధ్యక్షురాలు

న్యూఢిల్లీ : యూరోపియన్ యూనియన్ (ఇయు) అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వచ్చేవారం భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు ఇయు అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ ఈ నెల 27, 28 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారని విదేశాంగ శాఖ (ఎంఇఎ) శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఆమెతోపాటు ఇయు కాలేజ్ ఆఫ్ కమిషనర్లు కూడా పర్యటించనున్నారు.

ఇయు అధ్యక్షురాలు భారత్‌లో పర్యటించడం వరుసగా ఇది మూడవసారి. 2022 ఏప్రిల్‌లో ద్వైపాక్షిక అధికారిక పర్యటన కోసం భారత్‌ను సందర్శించారు. 2023 సెప్టెంబర్‌లో జి20 సమ్మిట్‌కి హాజరయ్యారు. ఇయు అధ్యక్షులతో ప్రధాని మోడీ ఉన్నత స్థాయి చర్చలు జరపనున్నారని ఎంఇఎ ఆ ప్రకటనలో పేర్కొంది. ఇయు కాలేజ్ ఆఫ్ కమిషనర్లు భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారని తెలిపింది. 2004 నుండి భారత్, ఇయులు వ్యూహాత్మక భాగస్వామ్యులుగా ఉన్నాయని, గతకొన్నేళ్లుగా ఈ బంధం మరింత బలోపేతమవుతోందని పేర్కొంది.

గంజాయి విక్రేతల ఆస్తులు జప్తు

- డిజిపి హరీష్‌కుమార్ గుప్తా
- రూ.1.85 కోట్ల విలువైన 3737 కిలోల గంజాయి ధ్వంసం



మీడియాతో మాట్లాడుతున్న డిజిపి హరిష్‌కుమార్ గుప్తా

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, సంబంధిత నేరస్తుల ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. కృష్ణా జిల్లాలో పట్టుకున్న గంజాయి, మత్తు పదార్థాలను పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులో శనివారం సాయంత్రం పోలీసు అధికారులు ధ్వంసం చేశారు. రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఐజి ఆకే రవికృష్ణ, ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్ కుమార్‌ల సమక్షంలో రూ.1.85 కోట్ల విలువైన 3,737 కిలోల గంజాయిని ధ్వంసం చేసినట్టు అధికారులు తెలిపారు. కృష్ణా జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్ల పరిధిలో 183 కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన 3,737 కిలోల గంజాయి, 4.22 కిలోల లిక్విడ్ గంజాయి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు, ఎక్సైజ్, ఈగల్ విభాగాల సమన్వయంతో గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు వివరించారు. ఇందుకు పరివర్తన పేరుతో అన్ని కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి గంజాయి ముఠాలపై నిఘా పెట్టినట్టు తెలిపారు. మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా ఉండేందుకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఒడిశా సరిహద్దుల్లో నిఘా

రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలో ఉన్నట్లు డిజిపి తెలిపారు. ఒడిశా ప్రాంతం నుండి పెద్ద ఎత్తున గంజాయి వస్తోందన్నారు. ఒడిశా సరిహద్దుల్లో నిఘా ఉంచినట్టు చెప్పారు. గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాని, వారికి శిక్షలు కూడా కఠినంగా ఉంటాయని తెలిపారు. ఈగల్ విభాగం ఎస్‌పి నగేష్‌కుమార్, కృష్ణా, పల్నాడు జిల్లాల ఎస్‌పిలు గంగాధరరావు, కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిర్చి ధర ప్రతిపాదనపై రైతు సంఘం అభ్యంతరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మిర్చి ధరను క్వింటాకు రూ.11,600 చొప్పున కేంద్రానికి ప్రతిపాదన చేయడంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసింది. మిర్చి ధరలు తగ్గి రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటన రైతులకు ఏ రకంగా ప్రయోజనం కలిగిస్తోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు మిర్చి యార్డులో శనివారం మిర్చి ధర క్వింటాకు రూ.14 వేలు పలికితే, ప్రభుత్వం రూ.11,600 ఎలా ప్రతిపాదించిందని ప్రశ్నించారు. క్వింటాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలు తక్కువ కాకుండా ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిర్చిని విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతులు సంపాదించాలని సూచించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద మార్కెట్లో ధరల వ్యత్యాసం నుంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పత్తి, మిర్చి, కంది, శనగ, జొన్న, మొక్కజొన్న, ధాన్యం, అపరాలు వంటి అన్ని పంటలకూ ధరలు తగ్గిపోవడంతో రైతులు పెద్దయెత్తున నష్టపోతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం రూ.20 వేలను తక్షణమే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.

మౌలానా ఆజాద్ స్ఫూర్తితో ముందుకు

- వైసిపి కార్యాలయంలో నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆలోచనలు, సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళతామని వైసిపి నేతలు తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మౌలానా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్నతమైన సేవలందించారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధాకర్‌బాబు, దూలం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 వాయిదా వేయాలి

- సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోస్టర్ విధానంలో తప్పులు సరిచేసే వరకూ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ శనివారం లేఖ రాశారు. గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై 2023 ఆగస్టులో 77 జిఒను జారీ చేసిన రోస్టర్ పాయింట్లను ప్రకటించిందన్నారు. నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నా గ్రూప్-2 ప్రిలిమ్స్ యథావిధిగా జరిగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎపిపిఎస్‌సి బోర్డులో మార్పులు జరిగాయని, దీంతో గ్రూప్-2 నోటిఫికేషన్‌లో దొర్లిన తప్పులను సరిచేస్తారని ఆశించినప్పటికీ ఫలితం లేదని పేర్కొన్నారు. రోస్టర్ పాయింట్లను సరిచేయకుండా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జరిగితే ఉద్యోగాల్లో చేరిన వారిని కూడా సుప్రీంకోర్టు, హైకోర్టు తొలగించిన సందర్భాలు ఉన్నాయన్నారు.

మిర్చి క్వింటా రూ.11,781

- కొనుగోలుకు కేంద్రం అంగీకారం
- 25 శాతం ఉత్పత్తి కొనుగోలు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మిర్చి క్వింటా ధర రూ.11,781 కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా గుంటూరు మిరప రైతులకు పెద్ద ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద క్వింటాకు రూ.11,781 మద్దతు ధరకు సేకరణకు ఆమోదం తెలిపిందని, ధరలు తగ్గుతున్నప్పటికీ స్థిరత్వాన్ని నిర్ధారిస్తుందని తెలిపారు. ప్రారంభంలో 25 శాతం మిర్చి ఉత్పత్తిని కొనుగోలు చేస్తారని, అవసరమైన విధంగా సేకరణను పెంచడానికి నిబంధనలు ఉంటాయని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసినందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్ శివరాజ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రఘువర్మకు మద్దతు : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం జనసేన అండగా నిలుస్తుందన్నారు. ఈ మేరకు పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ప్రజాహిత వ్యాజ్యం కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని క్లబ్బుల్లో గ్యాంబ్లింగ్, పేకాట నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. పిల్ ప్రచారం కోసం వేసినట్టు ఉందని అభిప్రాయపడింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారని తప్పుపట్టింది. ఊహాజనితమైన అంశాలతో పిల్ దాఖలు చేశారని పేర్కొంది. పిటిషనర్ మల్లవరపు లక్ష్మణ్ కుమార్‌కు రూ.50 వేల జరిమానా విధించింది. రెండు వారాల్లో ఈ మొత్తాన్ని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని దృష్టి వినికిడి లోపం ఉన్న చిన్నారుల సంక్షేమం కోసం వినియోగించాలని న్యాయ సేవాధికార సంస్థకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. రాష్ట్రంలోని క్లబ్బుల్లో పేకాట ఆడేందుకు, గ్యాంబ్లింగు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదని విజయవాడకు చెందిన లక్ష్మణకుమార్ ఇటీవల పిల్ దాఖలు చేశారు.

గ్రూపు-2 అభ్యర్థుల ఆందోళనతో

అట్టుడికిన విశాఖ

- జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో, రోడ్డుపై పడుకొని నిరసన
- రోస్టర్ పాయింట్లను సవరించాల్సిందేనంటూ డిమాండ్
- రాత్రి పది గంటలకు తాత్కాలిక విరమణ
- నేడు పరీక్షా కేంద్రాల వద్ద ఆందోళనలకు నిర్ణయం
- రేపు హైకోర్టులో వెయ్యి మంది పిటిషన్లు వేయబోతున్నట్టు ప్రకటన



ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

గ్రూపు-2 అభ్యర్థులు ఆందోళనతో శనివారం విశాఖ అట్టుడికింది. రోస్టర్ పాయింట్లను సవరించిన తర్వాతే గ్రూప్-2 మెయిన్ పరీక్ష నిర్వహించాలంటూ జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. శనివారం రాత్రి పది గంటల వరకూ ఆందోళన కొనసాగింది. అనంతరం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించి ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. గ్రూపు అభ్యర్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిల్చిపోయింది. విశాఖలో గ్రూపు-2 అభ్యర్థుల నిరసన మూడో రోజూ కొనసాగింది. ఎంవిపి కాలనీలోని ఆర్‌సి రెడ్డి స్టడీ సెంటర్ వద్ద పెద్ద ఆందోళనకు దిగారు. గ్రూపు-2 మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని సిఎం కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే, పరీక్షను యథావిధిగా కొనసాగిస్తున్నట్టు ఎపిపిఎస్‌సి ప్రకటించడంతో గ్రూపు-2 అభ్యర్థులు ఆందోళన తీవ్రతరం చేశారు. రోస్టర్ పాయింట్లను సవరించి పరీక్షలను కొనసాగించాలని లేదా పరీక్షను వాయిదా వేసి రోస్టర్ పాయింట్లను సవరించిన అనంతరం మరలా పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై వెబ్ నోట్ వెంటనే రిలీజ్ చేయాలంటూ నినాదాలు చేశారు. ఇసుకతోట వద్ద జాతీయ రహదారిపై రాత్రి ఏడు గంటల నుంచి బైఠాయించారు. తమకు న్యాయం జరిగే వరకూ కదిలేది లేదని తేల్చి చెప్పారు. తమ ఆందోళనను పట్టించుకోకుండా గ్రూప్-2 మెయిన్ పరీక్ష నిర్వహణకు ఎపిపిఎస్‌సి సిద్ధమవుతుండడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వ తీరుపై పెద్ద పెట్టున నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ రహదారిపై పడుకొని ఆందోళన కొనసాగించారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించినా భయపడకుండా పట్టుదలతో ఆందోళన చేశారు. వారిని పోలీసులు పక్కకు ఈడ్చుకెళ్తే అంతకు రెట్టింపు మంది వచ్చి అక్కడే బైఠాయించారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఇబ్బందులు పడ్డామని, టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎపిపిఎస్‌సి ఛైర్మన్ తమ సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని పలువురు మహిళా అభ్యర్థులు ప్రశ్నించారు. 2024లో తాను జనసేనకు ఓటు వేశానని, ఇప్పుడు పవన్ ఎక్కడికి వెళ్లారో అర్థం కావట్లేదని ఓ మహిళా అభ్యర్థి వాపోయారు. తమ జీవితాలను నాశనం చెయ్యొద్దంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. రాత్రి పది గంటలకు అభ్యర్థులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఆదివారం పరీక్షా కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తామని, వాటిని విజయవంతం చేయాలని గ్రూప్-2 అభ్యర్థులకు పిలుపునిచ్చారు. సోమవారం హైకోర్టులో వెయ్యి మంది పిటిషన్లు వేయబోతున్నట్టు చెప్పారు. ఆందోళనతో జాతీయ రహదారిపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ మళ్లింపునకు అధికారులు చర్యలు చేపట్టారు.

భూముల రీ సర్వేలో అవకతవకలు

- పెట్రోల్, పురుగుల మందు డబ్బాలతో రైతుల నిరసన

ప్రజాశక్తి- బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా)




బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

భూముల రీ సర్వేలో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ పురుగు మందు, పెట్రోల్ బాటిళ్లతో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గుమ్మసముద్రం రైతులు నిరసన తెలిపారు. దీంతో తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గుమ్మసముద్రం గ్రామంలో ఏ ఒక్క రైతుకు వన్‌బి అడంగల్ పత్రాలు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని దేవుడి మాన్యం భూమిని విలేజ్ సర్వేయర్ రాజేంద్ర తన తల్లి పేరు మీద ఆన్‌లైన్ చేసుకున్నారని రైతులు ఆరోపించారు. అవకతవకలకు పాల్పడిన విఆర్ఒ, సర్వేయర్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చేంత వరకూ ఇక్కడి నుంచి కదిలేదంటూ గుమ్మసముద్రం గ్రామం రైతులు భీష్మించుకు కూర్చున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని రైతు సుదర్శన్ తన వద్ద ఉన్న పురుగుమందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన తోటి గ్రామస్తులు సుదర్శన్ వద్ద ఉన్న పురుగుమందు డబ్బాను లాక్కున్నారు. పరిస్థితి ఉద్రిక్తతలకు దారితీస్తుండడంతో తహశీల్దార్ స్పందించి.. వచ్చే సోమవారం నుంచి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- హెచ్‌ఎం కుర్చీలో కూర్చొని ఎమ్మెల్యే కళా వెంకటరావు ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి




గుర్ల మండల కేంద్రంలోని జెడ్‌పి హైస్కూలులో హెచ్‌ఎం కుర్చీలో కూర్చున్న ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను అధికార టిడిపి ఎమ్మెల్యేలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. నేరుగా పాఠశాలల్లోకి వెళ్తూ హెచ్‌ఎం, ప్రిన్సిపళ్ల కుర్చీల్లో కూర్చొని తమ పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థికి ఓట్లు వేయాలని హుకుం జారీ చేస్తున్నారు. తాజాగా గుర్ల మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగిన ఘటనలే ఇందుకు నిదర్శనం. చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు తన మందీమార్బలంతో శనివారం ఎపిటిఎఫ్ అభ్యర్థి పి.రఘువర్మకు మద్దతుగా ప్రచారం చేపట్టారు. గుర్లలోని జడ్‌పి హైస్కూలుకు, జూనియర్ కళాశాలకు వెళ్లి నేరుగా హెచ్‌ఎం, ప్రిన్సిపల్ కుర్చీల్లో కూర్చున్నారు. ఎమ్మెల్యే వచ్చేసరికి వారు మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలకగా, ఎమ్మెల్యే నేరుగా వారి సీట్లలో కూర్చున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం బలపరుస్తున్న అభ్యర్థికి ఓటువేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే నేరుగా వచ్చి హెచ్‌ఎం, ప్రిన్సిపల్ కుర్చీల్లో కూర్చోవడంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు నివ్వెరపోయారు.

వరికపూడిశెల ప్రాజెక్టు అటకెక్కినట్టే!

- గోదావరి-బనకచర్లకు అనుసంధాన ప్రతిపాదన
- ఊరించి ఉస్సూరుమనిపిస్తోన్న టిడిపి కూటమి సర్కారు
- నెరవేరని పల్నాడు, ప్రకాశం జిల్లా వాసుల చిరకాల కల





వరికపూడిశెల ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

భారీ ప్రాజెక్టులతో ముడిపెట్టి చిన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనడానికి పల్నాడు జిల్లాలోని వరికపూడిశెల ఒక ఉదాహరణగా నిలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం గోదావరి జలాలను రాయలసీమకు తీసుకెళ్లేందుకు రూ.80 వేల కోట్లతో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే ప్రతిపాదన ఉన్నందున వరికపూడిశెలను ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేద్దామని ప్రతిపాదించింది. అయితే, కొంతమంది కాంట్రాక్టర్లు, ఇంజనీర్ల సలహా మేరకు వరికపూడిశెలను పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల ప్రచారంలో కూడా అధికారంలోకి రాగానే వరికపూడిశెలను పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొమ్మిది నెలల కాలంలో ఈ ప్రాజెక్టుపై ఒక్కసారి కూడా సమీక్షించలేదు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అటవీ, పర్యావరణ అనుమతులు తేవడంలో తీవ్రంగా కృషి చేసిన నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా కాంట్రాక్టర్లు, జలవనరుల శాఖ అధికారుల తీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ పథకానికి 1996లో చంద్రబాబు నాయుడు, 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, 2019లో అప్పటి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. అయినా, పనులు ముందుకు సాగలేదు. 2023లో అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చాయి. ప్రాజెక్టు పూర్తికి రూ.1,250 కోట్లు అవసరమని అంచనా వేశారు. వంద గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగు నీరు అందించాలనేది లక్ష్యం. 'వైఎస్‌ఆర్ పల్నాడు కరువు నివారణ పథకం' కింద రూ.340.26 కోట్లతో తొలిదశ పనులకు అదే ఏడాది నవంబరు 15న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పూర్తిగా పైపులైన్ల ద్వారా నీరందించే తొలి ప్రాజెక్ట్ వరికెపూడిశెల అని అధికారులు అప్పట్లో తెలిపారు. తొలి దశలో నాలుగు పంపుల ద్వారా 281 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. 57 టిఎంసిల నీటిని ఎత్తిపోసి సాగు, తాగు అవసరాలకు సరఫరా చేయాలి. ఈ పథకం ద్వారా కృష్ణా నది జలాలను మళ్లిస్తే పల్నాడు, ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన మెట్ట ప్రాంతాల ప్రజల కష్టాలు తీర్చుతాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అనూహ్యంగా ఈ పథకాన్ని పక్కన పెట్టి గోదావరి-బనకచర్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇందులో భాగంగా బొల్లాపల్లి వద్ద 60 వేల ఎకరాల్లో భారీ రిజర్వాయర్ నిర్మిస్తున్నామని, అక్కడి నుంచి బొల్లాపల్లి, వెల్దుర్తి, దుర్గి, పుల్లలచెరువు మండలాలకు నీరు తీసుకెళ్లవచ్చని, ఈ దృష్ట్యా వరికపూడిశెల ఇప్పుడు అవసరం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు జలవనరుల శాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టు ఏజెన్సీ నివేదించినట్టు తెలిసింది.

పక్కన పెట్టడం సరికాదు : కెఎస్ లక్ష్మణరావు



పల్నాడు, ప్రకాశం జిల్లాలకు ప్రయోజనం కలిగించే వరికపూడిశెల ప్రాజెక్టు ఎంతో అత్యవసరం. వేరే భారీ ప్రాజెక్టులకు ముడిపెట్టి దీనిని పక్కన పెట్టే ఆలోచన సరికాదు. వెంటనే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలి. దీనివల్ల లక్ష ఎకరాలకు తాగునీరు అందించవచ్చు. వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి, పుల్లలచెరువు మండలాల్లోని వంద గ్రామాల ప్రజల దాహార్తి తీర్చవచ్చు

- కెఎస్.లక్ష్మణరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ

మా ఓట్లతో గెలిచి.. మా సమస్యలు పట్టించుకోరేం !

- ఎమ్మెల్సీ చిరంజీవిరావు రాజీనామా చేయాలి
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తమ ఓట్లు వేయించుకుని, గెలిచిన తరువాత తమ కష్టాలను పట్టించుకోని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తక్షణమే రాజీనామా చేయాలంటూ విశాఖలోని ఓ స్టడీ సెంటర్ వద్ద నిరుద్యోగులు ఆగ్రహంతో నినాదాలు చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విశాఖలోనే ఉంటూ ఓ వ్యక్తికి మద్దతుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపడుతున్న ఆయన కనీసం తమ నిరసనకు సంఘీభావం తెలిపేందుకు కూడా రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాట తప్పిన వేపాడ చిరంజీవిరావు.. పదవికి రాజీనామా చెయ్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ వీడియోపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది. 'ఏరు దాటేదాకా ఓడ మల్లన్న - ఏరుదాటాక బోడి మల్లన్న', 'కల్లబొల్లి మాటలతో మోసం చేస్తారా ?' అంటూ ఆ వీడియో సాగింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ఈ వీడియో కలకలం రేపింది. పెద్దల సభకు జరుగుతున్న ఎన్నికల్లో ప్రజల కోసం, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పనిచేసేవారిని, ఉత్తరాంధ్ర వాణిని వినిపించేవారిని గెలిపించడం మంచిదని పలువురు వీడియో కింద కామెంట్లు సైతం పెట్టారు. సమస్యలపై గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే మంచిదన్న చర్చ జరిగింది.



వర్గీకరణ పూర్తయ్యే వరకు నోటిఫికేషన్‌లు, నియామకాలు ఆపండి : మందకృష్ణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎస్‌సి వర్గీకరణ పూర్తయ్యేంత వరకు నోటిఫికేషన్లు, నియామకాలను ఆపాలని ప్రభుత్వాన్ని ఎమ్‌ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ డిమాండ్ చేశారు. అనంతపురం గుత్తి రోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాల్‌లో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యకర్తల అత్యవసర సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

మంద కృష్ణ మాట్లాడుతూ.. ఎస్‌సి వర్గీకరణ కోసం వెయ్యి కళ్లతో మాదిగలు ఎదురు చూస్తున్నారన్నారు. వర్గీకరణ కోసం టిడిపి కూటమి ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ వేసి వడివడిగా వర్గీకరణకు అడుగులు వేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అతి త్వరలోనే ఎస్‌సి వర్గీకరణ చేసి మాదిగలకు మేలు చేయాలని కోరారు. ఇది జరిగితే జీవితాంతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తామందరమూ రుణపడి ఉంటామని తెలిపారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్‌లు, నియామకాలు చేపట్టరాదని డిమాండ్ చేశారు. అమరుల త్యాగ ఫలాలు మాదిగలకు చేరబోతున్న సందర్భంలో మాదిగ పల్లెలన్ని గ్రామ నడిబొడ్డున మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని జరుపుకోనేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు.

మార్చిలో కొత్త రేషన్ కార్డులు

- మంత్రి మనోహర్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం (నెల్లూరు)

మార్చిలో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించేందుకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నాదెండ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పట్టణ సమీపంలోని జెండాదిబ్బ వద్దనున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాం (స్టాక్ పాయింట్)ను ఆయన తనిఖీ చేశారు. రైసు మిల్లును తనిఖీ చేసి ధాన్యం సేకరణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మహిళలందరూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన దీపం-2 పథకం హామీని సిఎం చంద్రబాబు నెరవేర్చారని, ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలో నాలుగు లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 93.42 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని, ఈ ఏడాది 1.50 కోట్లు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.



ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు వినతినిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

విలేకరిపై దాడికి పాల్పడిన టిడిపి నాయకుడ్ని అరెస్టు చేయాలి

- ఎంపి కలిశెట్టికి జర్నలిస్టులు వినతి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల విలేకరి ఎం.రామారావుపై దాడికి పాల్పడడంతోపాటు చంపుతానంటూ బెదిరించిన టిడిపి నాయకుడు గుల్ల వేణుగోపాల్ నాయుడును అరెస్టు చేసి, రామారావుకు రక్షణ కల్పించాలని కోరుతూ విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడుకు జర్నలిస్టులు శనివారం వినతిపత్రం అందజేశారు. టిడిపి మక్కువ మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేస్తున్న వేణుగోపాల్‌నాయుడు... రామారావును కొట్టడంతోపాటు చంపుతానని బెదిరించిన సంగతి విదితమే. సంఘటన జరిగిన రోజే జర్నలిస్టులు, ప్రజా సంఘాల మద్దతుతో మక్కువ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జర్నలిస్టు సంఘాలు, స్వతంత్ర జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎంపి కలిశెట్టిని జర్నలిస్టులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఘటన పూర్వపరాలను ఎంపి అడిగి తెలుసుకున్నారు. వెంటనే దాడికి పాల్పడిన టిడిపి నాయకుడు వేణుగోపాల్‌నాయుడుకు ఫోన్ చేసి వివరణ కోరారు. 'చంపుతానని బెదిరించడం వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తుందని, జర్నలిస్టులను బెదిరించడం, వారిపై దాడికి పాల్పడడం టిడిపి సంస్కృతి కాదని' హితబోధ చేశారు. వారు రాసిన వార్తల్లో అవాస్తవాలు ఉంటే, జిల్లా, రాష్ట్ర స్థాయి బాధ్యులకు తీసుకెళ్లవచ్చని సూచించారు.

ఫైబర్‌నెట్ స్కాం చంద్రబాబుదే

- మాజీ ఛైర్మన్ గౌతంరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ద్వారా గతంలో రూ.121 కోట్ల అవినీతికి పాల్పడిన కేసులో ముద్దాయిగా ఉన్న చంద్రబాబు ఇప్పుడు అధికారాన్ని ఉపయోగించుకుని కేసు నుండి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నారని ఎపి ఫైబర్‌నెట్ మాజీ ఛైర్మన్ పూనూరు గౌతంరెడ్డి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే సిఐడి అన్ని అధికారాలతో చంద్రబాబుపై కేసు నమోదు చేసిందని తెలిపారు. ఈ కేసులో వాస్తవాలు వెలుగులోకి తెచ్చిన ఐఎఎస్ అధికారులను తమ స్టేట్‌మెంట్లను మార్చి చెప్పాలని ప్రభుత్వం బెదిరిస్తోందన్నారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం ఎపి ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌ను ప్రారంభించిందని తెలిపారు. తొలుత రూ.321 కోట్లకు టెండర్లు పిలిచారని, దీనిలో రూ.121 కోట్ల అవినీతి వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. దీన్నుండి బయటపడేందుకు ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌ను మూసేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. టెరాసాఫ్ట్‌లో పనిచేసే వేమూరి హరికృష్ణ ప్రసాద్‌ను దీనిలో డైరెక్టర్‌గా నియమించిందని పేర్కొన్నారు. 2015 మే 11న బ్లాక్ లిస్టులో ఉన్న ఈ కంపెనీ అదే ఏడాది ఆగస్టు 6న బ్లాక్‌లిస్టు నుండి తీసేశారని తెలిపారు. ఆ మర్నాడే ఎపి ఫైబర్‌నెట్ టెండర్లు పిలిచారని వివరించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను మీడియాకు చూపుతున్న ఎస్‌పి సతీష్‌కుమార్

బంగారం దొంగలు అరెస్టు

- 4.80 కిలోలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద ఆరు రోజుల క్రితం ఐదు కిలోల బంగారాన్ని చోరీ చేసిన ఘటనలో ఎనిమిది మంది నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తన కార్యాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. మంగళగిరికి చెందిన రాము విజయవాడలో జ్యూయలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆర్డర్లపై ఆభరణాలు ఇతను తీసుకు వెళ్లి విక్రయిస్తుంటారు. నగలను మంగళగిరిలోని తన ఇంటికి తీసుకువెళ్లాలని ఈనెల 15న రాత్రి 8.50 గంటల సమయంలో తన వద్ద నమ్మకస్తుడైన నాగరాజుకు అప్పగించారు. సుమారు 9.23 గంటలకు తన యజమాని రాముకు ఫోన్ చేసి, మార్గమధ్యలో ఆత్మకూరు అండర్‌పాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడి చేసి బంగారు నగలను దోచుకుని పారిపోయారని నాగరాజు చెప్పాడు. దీంతో రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో నాగరాజుతో పాటు షాపులో పనిచేస్తున్న భరత్, మరో ఆరుగురితో కలిసి నగలు దోచుకున్నట్లు తెలిసింది. పోలీసులు అరెస్టు చేసిన వారిలో నాగరాజు, అడపా భరత్, కె.నవీన్, షేక్ ఇర్ఫాన్, వి. మోహన్‌కృష్ణ, వరకాల లోకేష్, పొట్నూరి చంద్రశేఖర్, ఎస్.అరుణ్‌కుమార్ ఉన్నారు. నిందితుల నుంచి రూ. ఐదు కోట్ల విలువైన 4.80 కేజీల బంగారు ఆభరణాలు, మరో రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు.

సంఘాల మధ్య తేడా ఉపాధ్యాయులకు తెలుసు

- ఎపిటిఎఫ్ (1938)

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర ఉద్యమ పితామహులు మారుప బాలకృష్ణమ్మ స్ఫూర్తితో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938)కి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలను ఆశ్రయించి, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యంతో మిలాఖత్ అయిన ఎపిటిఎఫ్ (257)కు ఉన్న తేడా ఉపాధ్యాయులకు బాగా తెలుసునని ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. టీచర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు, వివిధ రకాల వేల కోట్లు పెండింగ్ బకాయిలు, పిఆర్‌సి, సిపిఎస్ రద్దు, కారుణ్య నియామకాలు, తెలుగు మీడియం, బోధనా స్వేచ్ఛా తదితర సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఉపాధ్యాయులు కోరుకుంటున్నారని, అవి అడగకుండా ప్రభుత్వంతో మిలాఖత్ కావడాన్ని ఉపాధ్యాయ వర్గం నిలదీయడాన్ని ఎపిటిఎఫ్ 257 జీర్ణించుకోలేక ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938పై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు.

ధాన్యానికి రూ.500 బోనస్

'చలో నెల్లూరు'లో ఏపి రైతు, కౌలు రైతు వ్యవసాయ, కార్మిక సంఘాల డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ధాన్యానికి మద్దతు ధర సాధించుకునేందుకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు సంయుక్తంగా 'చలో నెల్లూరు' కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత నెల్లూరు జిల్లా ఇందుకూరు పేట మండలానికి చెందిన రైతులు పాదయాత్రగా ఎబిఎం కాంపౌండ్‌కు అక్కడి నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ధాన్యం మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరకు బోనస్‌గా రూ.500లు రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏడు లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారన్నారు. గతేడాది పుట్టి (850 కేజీలు) ధాన్యం రూ.26 వేల నుంచి రూ.25 వేలు వరకు మద్దతు ధరగా నిర్ణయించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసిందని, ఈ ఏడాది రూ.18 వేలకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే మద్దతు ధర తక్కువగా ప్రకటిస్తే, ధాన్యం కొనుగోలు చేసే సమయంలో దళారులు మరింత ధర తగ్గిస్తారని తెలిపారు. టిడిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతుల నుంచి ఒక క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధరకు బోనస్‌గా రూ.500లు అందజేసి, సదరు పంటను కొనుగోలు చేయాలని కోరారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రతి మాసూళ్ల సీజన్‌లో దళారులు, మిల్లర్లు ఏకమై రైతులను పలు రకాలుగా ఇబ్బంది పెట్టి, మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేయడం సరికాదన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ.. ' ఇ పంట' పోర్టల్‌లో నమోదు చేయని, ఇకెవైసి పూర్తి చేయని రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు కలిసి సమస్యలను వివరించారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు.

దిశ యాప్ నిర్వీర్యం

- వైసిపి అధికారి ప్రతినిధి శివశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం దిశ యాప్‌ను నిర్వీర్యం చేసిందని, తొమ్మిది నెలల తరువాత కొత్త యాప్ తెస్తామని చెబుతున్నారని, దిశ యాప్‌ను కొనసాగించడానికి వచ్చిన సమస్య ఏమిటో చెప్పాలని వైసిపి అధికారి ప్రతినిధి పుత్తా శివశంకర్‌రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఉన్న దిశ యాప్‌ను రద్దుచేసి సురక్షా యాప్ తీసుకొస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దిశ యాప్ రూపొందించడంతోపాటు గత ప్రభుత్వం 18 పోలీస్ స్టేషన్లు, 13 పోక్సో కోర్టులు, 12 మహిళా కోర్టులు కూడా ఏర్పాటు చేసిందని అన్నారు. 19 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా నియమించిందని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- భూపతిరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పాత బకాయిలు, సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన బకాయిలు, ఎపిజిఐఎల్ మెచ్యూర్ బాండ్స్‌కు సంబంధించిన బకాయిలు బడ్జెట్ నేపథ్యంలో నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎస్‌పై కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

రేపు పిఎం కిసాన్ నగదు విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పిఎం కిసాన్ పథకం కింద 19వ విడత నగదును సోమవారం విడుదల విడుదల చేయనున్నారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్) 19వ విడతను బీహార్‌లోని భాగల్పూర్ నుండి రైతుల ఖాతాల్లోకి ఒకే క్లిక్‌తో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బదిలీ చేస్తారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. మొత్తం 9.8 కోట్ల మంది రైతులకు రూ.22 వేలకోట్లు వారి ఖాతాల్లో వేస్తామని పేర్కొన్నారు. 2029 ఫిబ్రవరి 24న ప్రారంభించిన ఈ పథకం అర్హత కలిగిన రైతు కుటుంబానికి ఏడాదికి రూ.6,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు 18 విడతల ద్వారా రైతు కుటుంబాలకు రూ.3.46 లక్షల కోట్లకు పైగా నగదు ఇచ్చామని పేర్కొన్నారు.


చెంచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజానుకూల బడ్జెట్ కోసం ప్రజా ఉద్యమాలు

- మాజీ ఎమ్మెల్యే చెంచయ్య వర్ధంతి సభలో వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజానుకూల బడ్జెట్ సాధించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజలు ఉద్యమాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కోరారు. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా 'కేంద్ర బడ్జెట్ - గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై శనివారం ఒంగోలులోని ఎల్‌బిజి భవన్‌లో సెమినార్ నిర్వహించారు. ముందుగా చెంచయ్యకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యవక్తగా వి.వెంకటేశ్వర్లు మాట్లాడూతూ.. 92 ఏళ్ల జీవితంలో 70 ఏళ్లకు పైగా ప్రజా ఉద్యమాలకు చెంచయ్య అంకితమయ్యారని, భూ సమస్య, కూలి వంటి సామాజిక సమస్యలపై పోరాటాలకు నాయకత్వం వహించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని సూచించారు. 1955లో ఉద్యమ అవసరాల రీత్యా ఒంగోలుకు వచ్చిన ఆయన తన ఇంటిని ఉద్యమ కేంద్రంగా నడిపారని గుర్తు చేశారు. అటువంటి త్యాగమూర్తుల కృషితో సాధించుకున్న హక్కులను, చట్టాలను పాలకులు నిర్వీర్యం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు జాలా అంజయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.కె. మాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. సెమినార్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. తొలుత తవనం చెంచయ్య చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు సిఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటాం

- కామన్ పిజి సెట్‌ను రద్దు చేయాలి: విద్యార్థి సంఘాల డిమాండ్
- 4వ తేదీ డిగ్రీ, యూనివర్సిటీల బంద్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'కామన్ పిజి సెట్‌ను రద్దు చేయని పక్షంలో ఆదివారం తిరుపతికి రానున్న సిఎం చంద్రబాబును అడ్డుకుంటామని' విద్యార్థిసంఘాలు హెచ్చరించాయి. సిఎం స్పందించకుంటే 4న జిల్లా వ్యాప్తంగా అన్ని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీల్లో బంద్ చేయనున్నట్లు వెల్లడించాయి. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం నాయకులు తిరుమలేష్ అధ్యక్షతన శనివారం ప్రెస్‌మీట్ జరిగింది. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శి అక్బర్, అశోక్, ఐస జిల్లా కార్యదర్శి చిన్నా, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఆశ, నల్సా రాష్ట్ర అధ్యక్షులు సుందర్‌రాజు, జిఎన్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎపి ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఎపి పిజిసెట్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఎన్నికల ముందు పిజి సెట్ల నిర్వహణ గురించి మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కామన్ పిజి ప్రవేశాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అడ్మిషన్లు తగ్గిపోతున్నాయన్నారు. తాజాగా ఉన్నత విద్యామండలి విడుదల చేసిన వివిధ కోర్సులకు సంబంధించిన నోటిఫికేషన్‌లో పిజి సెట్ పాత పద్ధతిలోనే ఉమ్మడిగా ఉందని పేర్కొన్నారు.

ఇన్‌ఛార్జ్‌ల పాలనలో ఇంధనశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన శాఖలో అంతా ఇన్‌చార్జ్‌ల పాలనే సాగుతోంది. ఆ శాఖ అధిపతి నుంచి విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కిందిస్థాయి వరకు అందరూ అదనపు బాధ్యతలే నిర్వహిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ఈ శాఖలో కీలక పోస్టులను కూడా ప్రభుత్వం భర్తీ చేయకపోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె విజయానంద్‌కు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు రాష్ట్రప్రభుత్వం అప్పగించింది. ఇటు సిఎస్‌గా, అటు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆయన రెండు బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. మరో పక్క జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో డైరెక్టర్ పోస్టులు ఎనిమిది నెలల నుంచి ఖాళీగా ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే డైరెక్టర్ పదవుల్లో కొనసాగుతున్న వారు రాజీనామా చేశారు. ఇప్పటివరకు ఆ పోస్టులను భర్తీ చేయలేదు. రెండు నెలల క్రితం ఈ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలను కూడా ఇంధన శాఖ నిర్వహించింది. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ప్రభుత్వం వద్దకు పంపింది. ఈ ముగ్గురిలో ఒక్కరి చొప్పున ప్రభుత్వం ఎంపిక చేయాల్సి ఉండగా రెండు నెలల నుంచి ఈ పని పూర్తికావడం లేదు. దీంతో ఇన్‌ఛార్జ్‌లే దిక్కుగా మారిన పరిస్థితి నెలకొంది. జెన్‌కో ఎమ్‌డిగా ఉన్న కెవిఎన్ చక్రధర్ బాబు ట్రాన్స్‌కో విజిలెన్స్ జెఎండితో పాటు జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

జెన్‌కో థర్మల్, బొగ్గు, హైడల్, ఫైనాన్స్, హెచ్‌ఆర్ డైరెక్టర్ల పదవుల్లో కూడా ఇన్‌ఛార్జ్‌లే కొనసాగుతున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత పంపిణీ సంస్థ(ఎపిసిపిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సిఎండి)ని ఇటీవల ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ పోస్టును కూడా ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్‌గా ఉన్న ఎవికె భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ డిస్కంలలో డైరెక్టర్ పోస్టులను కూడా ఇన్‌చార్జ్‌లతోనే నడిపిస్తోంది.

ఎపిఇఆర్‌సి చైర్మన్ ఖాళీనే

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) చైర్మన్ పదవి కూడా ఐదు నెలల నుంచి ఖాళీగా ఉంది. గత అక్టోబర్‌లో చైర్మన్‌గా ఉన్న జస్టిస్ నాగార్జున రెడ్డి పదవి కాలం ముగిసింది. అప్పటి నుంచి ఇఆర్‌సి సభ్యులుగా ఉన్న ఠాకూర్ రామ్‌సింగ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు. ఠాకూర్ రామ్‌సింగ్ పదవి కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. ఇన్‌చార్జ్ చైర్మన్‌తో 2025-26 విద్యుత్ టారీఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేయడంతో పాటు టారిఫ్‌ను కూడా విడుదల చేశారు.

ఈ ఏడాదైనా ఆధునీకరణ జరిగేనా?

- వేసవి సమీపిస్తున్నా గోదావరి డెల్టా కాలువ పనులపై నిర్లక్ష్యం
- దాదాపు రూ.400 కోట్ల పనులకు ప్రతిపాదనలు
- నేటికీ ఆమోదం తెలపని ప్రభుత్వం
- జలవనరుల శాఖ మంత్రి సొంత జిల్లాలోనూ ఇదే పరిస్థితి

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఈ ఏడాదీ గోదావరి డెల్టా ఆధునీకరణ పనులపై అనుమానాలు నెలకొన్నాయి. దీంతో, ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కాలువలకు నీటి విడుదల నిలుపుదల సమయం దగ్గరపడుతోంది. కాలువల ఆధునీకరణ, షట్టర్ల మరమ్మతు పనులకు జిల్లా ఇరిగేషన్ శాఖాధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించారు. వీటికి నేటికీ ఆమోదం లభించలేదు. వైసిపి ప్రభుత్వం గడిచినా ఐదేళ్లలో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం అదే దారిలో నడుస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఆధునీకరణకు నోచుకోకపోవడంతో పూడుకుపోయిన బొండాడ ఛానల్

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉప కాలువల ద్వారా గోదావరి నుంచి సాగునీరు సరఫరా అవుతుంది. దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో డెల్టా ఆయకట్టు ఉంది. ఆధునీకరణ జరగకపోవడంతో పంట కాలువలు మెరకదేరిపోయి ఏటా ఖరీఫ్‌లో వర్షాలు, వరదలు, తుపాన్లకు వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతోంది. రబీలో నీటి ఎద్దడి సమస్యతో రైతులు సతమతమవుతున్నారు. గడిచిన ఖరీఫ్‌లో మూడుసార్లు విరుచుకుపడిన వర్షాలు, వరదలకు ఈ రెండు జిల్లాల్లో 29 వేల ఎకరాల్లో రైతులు పంటలను కోల్పోయారు. రూ.27 కోట్ల మేర పంట నష్టం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రైతులకు కొంతమేరకే పంట నష్టపరిహారం అందింది. ఎకరాకు రూ.20 వేలకుపైగా నష్టం వాటిల్లితే ప్రభుత్వం రూ.పది వేలు మాత్రమే ఇచ్చింది. డెల్టా కాలువల ఆధునీకరణ పనులకు పశ్చిమగోదావరి జిల్లాలో రూ.225 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.160 కోట్లు అవసరమని ప్రస్తుత ప్రభుత్వానికి ఇరిగేషన్ అధికారులు నివేదించారు. నిబంధనల ప్రకారం జనవరిలోనే ఈ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. ఆ తర్వాత టెండర్ల ప్రకియ పూర్తి చేసి పనులు చేపట్టే సరికి ఏప్రిల్ వస్తుంది. ఏప్రిల్ 15 నుంచి పంట కాలువలకు సాగునీటి సరఫరా నిలిపివేయాలని జిల్లా సాగునీటి సలహా మండలి నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత వెంటనే పనులు ప్రారంభించడానికి అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ జాప్యమైతే వర్షాలు పడితే పనులకు ఆటంకం ఏర్పడనుంది. ప్రభుత్వ వైఖరి రైతుల ఆశలను నీరుగార్చేలా ఉంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పశ్చిమగోదావరి జిల్లాకు చెందినవారు. దీంతో, గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పరుగులు తీస్తాయని జిల్లా రైతాంగం భావించింది. పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఆధునీకరణ పనులను ఆమోదించాలని, పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేయాలని గోదావరి డెల్టా రైతులు కోరుతున్నారు.

చితికిన చిన్న షేర్లు

- 400 స్టాక్స్ 53 శాతం మేర పతనం
- టారిఫ్ దెబ్బలకు విలవిల
- రిటైల్ ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనంతో చిన్న షేర్లు చితికి పోతున్నాయి. తక్కువ విలువ కలిగిన ఈ షేర్లలో అత్యధికంగా సాధారణ రిటైల్ మదుపర్లు ఎన్నో ఆశలతో పెట్టిన పెట్టుబడులు ఆవిరి అయిపోతున్నాయి. ఇటీవల నెలన్నర రోజులుగా వరుసగా పడిపోతున్న స్టాక్ మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోకపోవడంతో ఇన్వెస్టర్లలో తీవ్ర నిరాశ నెలకొంది. కేవలం గడిచిన ఒక్క వారంలోనే 400 స్మాల్ క్యాప్ షేర్లు ప్రతికూల రిటర్న్‌లను ఇచ్చాయి. అందులో 23 షేర్లు రెండంకెల స్థాయిలో క్షీణించాయి. ఇందులో సూరత్‌వాలా బిజినెస్ గ్రూప్ షేర్ అత్యధికంగా 53 శాతం పతనమయ్యింది. ఇదే బాటలో బెస్ట్ అగ్రోలైఫ్ 31 శాతం, డీ డెవలప్‌మెంట్ ఇంజనీర్స్ 27 శాతం, పిటిసి ఇండస్ట్రీస్ 21 శాతం చొప్పున నష్టపోయాయి. కేవలం ఐదు సెషన్లలోనే ఈ స్థాయిలో షేర్లు పడిపోవడంతో అందులో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు బోరుమంటున్నారు. బిఎస్‌ఇ-500 విభాగంలో దాదాపు 225 షేర్లు నేల చూపులు చూశాయి. మహీంద్రా లాజిస్టిక్స్, కర్బోరుండమ్ యూనివర్శల్, వక్రంగీ, క్రెడిట్ అక్సెస్ గ్రామీన్, నాట్కో ఫార్మా, క్రిసిల్, మహీంద్రా అండ్ మహీంద్రా, జమ్నా ఆటో, ది ఇండియా సిమెంట్స్ షేర్లు అధిక పేలవ ప్రదర్శన కనబర్చిన వాటిలో ఉన్నాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ బేర్ గుప్పిట్లో చిక్కుకున్నాయి. దాదాపు 27 స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ అన్నీ కూడా నష్టాలను చవి చూశాయి. ఎంతో ఆశగా చిన్న షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు కలిగిన రిటైల్ మదుపర్లు ఊహించని నష్టాలతో కన్నీరుమున్నీరు అవుతోన్నారు. గడిచిన ఏడాది కాలం సిప్‌ల్లో ప్రతికూల రిటర్న్‌లు నమోదవుతున్నాయి. భారత్‌పై బరోబర్ సుంకాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన భారత మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోన్న విషయం తెలిసిందే.

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

గంజాయి ముఠాను అన్నమయ్య జిల్లా మదనపల్లె రెండవ పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.2.5 లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి కొండయ్యనాయుడు ఇందుకు సంబంధించిన వివరాల వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు క్రైమ్ సిఐ చంద్రశేఖర్, రెండో పట్టణ సిఐ రామచంద్ర, రూరల్ సిఐ సత్యనారాయణ, క్రైమ్ సిబ్బంది కలిసి గంజాయి సరఫరా రధారులపై డేగ కన్ను వేశారు. పట్టణంలోని చంద్రా కాలనీకి చెందిన భాగ్యమ్మ, ఆవుల శివమ్మ, ఆవుల అనిల్ గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పుంగనూరు, పిటిఎం పోలీసుస్టేషన్లో భాగ్యమ్మపై గతంలో మూడు గంజాయి కేసులు ఉన్నాయి. విశాఖపట్నం నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు నిందితులు తెలిపారు. వారిపై పిడి యాక్టు నమోదు చేసేందుకు ఎస్‌పికి సిఫారసు చేస్తామని డిఎస్‌పి చెప్పారు.

'పోలవరం'పై అధ్యయనానికి కమిటీ

- కాంగ్రెస్ పార్టీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల నేతృత్వంలో 8 మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. కమిటీలో పిసిసి ప్రధాన కార్యదర్శి జి సత్యేంద్ర, ఉపాధ్యక్షులు ఎస్ మార్టిన్ లూథర్, అధికార ప్రతినిధి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు టి కె విశ్వేశ్వరరెడ్డి, బుల్లిబాబు, ఆర్ రామ్మోహనరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు రామలక్ష్మి, బండి విజయ భాస్కర్ ఉన్నట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టును 2014 నాటికి మొత్తం 33 శాతం పూర్తి చేశారని, ప్రాజెక్టు నిర్వాసితులైన 56 వేల కుటుంబాలకు పునరావాస సమస్యలు, ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయంపై ఈ కమిటీ అధ్యయనం చేసి నివేదిక రూపొందించనున్నట్లు పేర్కొంది. అధ్యయనంలో గుర్తించిన సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున పోరాడనున్నట్లు తెలిపింది. ఈ కమిటీ రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలోనూ పర్యటించనుందని వెల్లడించింది.


విద్యార్థి గల్లంతైన రాతిబావి


వీర ఆచారి (ఫైల్)

ఈత కోసం బావిలో దూకి విద్యార్థి గల్లంతు

- గజ ఈతగాళ్లతో గాలింపు


ప్రజాశక్తి-గుత్తి (అనంతరపురం జిల్లా)

బావిలోకి దూకి ఓ విద్యార్థి గల్లంతైన సంఘటన అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని ఆచారి కాలనీలో నివాసం ఉంటున్న వేణుగోపాలాచారి, రాజమ్మ దంపతుల కుమారుడు వీర ఆచారి (15) కోట ప్రాంతంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు వెళ్లిన వీర ఆచారి మధ్యాహ్నం భోజన అనంతరం స్నేహితులతో కలిసి సమీపంలో ఉన్న రాజాబావి వద్దకు ఈతకు వెళ్లాడు. తన స్నేహితులు బావిలోకి దూకడం చూసి ఈత రాకపోయినా స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టాను అంటూ బావి పైనుంచి లోనికి దూకాడు. బాలుడు ఎంతసేపటికి నీటి పైకి రాకపోవడంతో భయభ్రాంతులకు గురైన తోటి స్నేహితులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయులు గుంతకల్లు మండలం వైటి చెరువు గ్రామం నుంచి ఇద్దరు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు రెస్క్యూ టీం బావిలో గాలించారు. అయినా బాలుని ఆచూకీ లభించలేదు. కుమారుడు గల్లంతయిన విషయాన్ని తెలుసుకున్న తండ్రి వేణుగోపాల ఆచారి బావి వద్ద కన్నీటి పర్యంతం అయ్యాడు. మున్సిపల్ కమిషనర్ బి జబ్బార్ మియా, తహశీల్దార్ డి ఓబిలేసు, సిఐ బి వెంకటేశ్వర్లు, ఎంఇఒ బి రవి నాయక్‌లు బావి వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షించారు. బాలుని ఆచూకీ కోసం అధికారుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

రూ.1.12 లక్షల కోట్ల ఎఫ్‌ఐఐల విక్రయం



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లలో నీలినీడలు కమ్ముకోవడంతో విదేశీ మదుపర్లు ఇక్కడి మార్కెట్ల నుంచి భారీగా నిష్క్రమిస్తున్నారు. దేశీయంగా గొప్ప ఆర్థిక వృద్ధి సంకేతాలు ఏవీ కానరాకపోవడంతో పాటు అమెరికా మార్కెట్లు ఆకర్షణీయంగా కనబడటంతో పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు రూ.1,12,492 లక్షల కోట్ల విలువ చేసే ఈక్విటీలను విదేశీ మదుపర్లు విక్రయించారు. దీంతో ఆ మొత్తాన్ని భారత మార్కెట్ల నుంచి తరలించుకుపోయినట్లయ్యింది. ఎన్‌ఎస్‌డిఎల్ గణంకాల ప్రకారం.. జనవరిలో రూ.81,903 కోట్లు, ఫిబ్రవరిలో ఇప్పటి వరకు రూ.30,588 కోట్ల విలువ చేసే ఎఫ్‌ఐఐలు తరలిపోయాయి. గత కొన్ని నెలలుగా భారత మార్కెట్లు భారత నష్టాలను చవి చూస్తోన్న విషయం తెలిసిందే. భౌగోళిక అనిశ్చితి పరిస్థితులు, అమెరికాలో బాండ్ రాబడులు పెరగడంతో ఎఫ్‌ఐఐలు అక్కడికి వెళ్లిపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో అక్కడి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయగలరన్న విశ్వాసం వర్ధమాన మార్కెట్లను కుదేలు చేస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలోనూ గొప్ప సానుకూలాంశాలు కానరాకపోవడం, దేశంలో వినిమయం తగ్గడంతో కార్పొరేట్ల కంపెనీల ఆదాయాల్లో ఒత్తిడి ఉండొచ్చనే అంచనాలు మార్కెట్లను ఒత్తిడికి గురి చేస్తోన్నాయి.



జెఎస్‌డబ్ల్యు చైర్మన్‌కు ఎఐఎంఎ అవార్డు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌కు ప్రతిష్టాత్మక 15వ ఎఐఎంఎ మేనేజింగ్ ఇండియా అవార్డ్స్‌లో ఈ దశాబ్దపు బిజినెస్ లీడర్ అవార్డ్ దక్కింది. శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును సజ్జన్ జిందాల్‌కు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ ప్రసాద అందజేశారు. సజ్జన్ సారథ్యంలో జెఎస్‌డబ్ల్యు గ్రూప్ 24 బిలియన్ డాలర్ల రెవెన్యూను సాధించింది.

దిగుమతి ఉక్కుతో దేశీయ పరిశ్రమకు దెబ్బ

- టాటా స్టీల్ సిఇఒ నరేంద్రన్

న్యూఢిల్లీ : చౌక ధరల్లో దిగుమతి చేసుకుంటున్న ఉక్కు వల్ల దేశీయ పరిశ్రమ దెబ్బతింటుందని టాటా స్టీల్ సిఇఒ టివి నరేంద్రన్ పేర్కొన్నారు. మిగతా మార్కెట్లలో అవకాశాల్లేక పలు దేశాల నుంచి స్టీల్ భారత్‌కు వస్తోందన్నారు. దీనితో దేశీయంగా ధరలు పడిపోవడం ద్వారా ఇక్కడి ఉక్కు కంపెనీలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్తు ఉక్కు పరిశ్రమల పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపొచ్చన్నారు. కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని పరిశ్రమ ఎదురు చూస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. గడిచిన ఏప్రిల్ నుంచి జనవరి కాలంలో ఉక్కు దిగుమతులు 20 శాతం పెరిగి 8.29 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి.

నెలన్నరలో బంగారం రూ.9500 పెరుగుదల

ముంబయి : వాణిజ్య యుద్ధ భయాలు, భౌగోళిక ఆందోళనలకు తోడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనిశ్చిత్తి ఆర్థిక విధానాలు బంగారం ధరలను ఎగిసి పడేలా చేస్తోన్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో గడిచిన ఏడు వారాల్లోనే పసిడి ధర రూ.9,500 పెరిగింది. గడిచిన ఏడు వారాల్లో భారత ఎంసిఎక్స్‌లో 10 గ్రాములు బంగారం ధర రూ.76,544 నుంచి రూ.86,020కు పెరిగింది. శుక్రవారం ముగింపు నాటికి రూ.86,020గా నమోదయ్యింది. అంతర్జాతీయంగా ఒక్క ఔన్స్ ధర రూ.2,954.94 డాలర్లుగా పలికింది.

సంపాదకీయం

హిందీ రుద్దొద్దు!

'పదవీ వ్యామోహాలు కులమత భేదాలు/ భాషాద్వేషాలు చెలరేగే నేడు/ ప్రతి మనిషి మరియొకని దోచుకొనేవాడే/ తన సౌఖ్యం తన భాగ్యం చూచుకొనేవాడే' అంటాడు మహాకవి శ్రీశ్రీ. కుల, మత, భాషా, సాంస్కృతికంగా వైవిధ్యభరితమైన దేశం మనది. భాష... జీవ, భౌతిక, సామాజిక, మనో వైజ్ఞానిక లక్షణాల సమాహారం. భిన్న భాషలు, భిన్న కులాలు, విభిన్న సంస్కృతులను ఐక్యం చేసే ఏకాత్మ మన భారతీయత. ఈ ఐక్యతను దెబ్బతీసేందుకు, ఏకాత్మ మూల వేరును పెకలించేందుకు మతోన్మాద శక్తులు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి. 2025 నాటికి భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చాలన్న ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాలో భాగమే బిజెపి తెరపైకి తెచ్చిన త్రిభాషా సూత్రం. దేశ వైవిధ్యాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా... దేశవ్యాప్తంగా హిందీ అమలు కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోంది. "హిందీ, హిందూ, హిందుస్థాన్" వంటి ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి కోణాన్ని రుద్దడం ఆమోదయోగ్యం కాదు' అని సీతారాం ఏచూరి గతంలోనే చెప్పారు. 'దేశంలో అనేక భాషలున్నాయని, ఒకే భాషను దేశభాషగా పేర్కొనలేమని, ఉన్నత విద్యాసంస్థల్లో హిందీని ప్రధాన బోధనా భాషగా నిర్వహించలేమని' కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టంగానే చెప్పారు. అయినా... బిజెపి సామ దాన భేద దండోపాలయాలను ప్రయోగిస్తూనే వుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి హిందీ యేతర భాషలు మాతృభాషగా గలవారి సంఖ్యే ఎక్కువ. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ అధికారికంగా గుర్తించిన 22 భాషల్లో హిందీ కూడా ఒకటి. అంతకు మించి హిందీకి ఎటువంటి ప్రత్యేకతనూ రాజ్యాంగం కల్పించలేదు. మరి హిందీకి కామన్ లాంగ్వేజ్ హోదా ఎప్పుడు వచ్చిందో కేంద్ర ప్రభుత్వమే చెప్పాలి. ఇలాంటి ప్రమాదాన్ని ముందే ఊహించిన రాజ్యాంగ నిర్మాతలు...8వ షెడ్యూల్‌లో 14 భాషలను చేర్చారు. ఇవి తర్వాత 22కు చేరాయి. అనుసంధాన భాషగా ఇంగ్లీష్‌ను కొనసాగించారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక అవసరాలను తీర్చేదిగా హిందీని అభివృద్ధి చేయాలని అంటూనే సంస్కృతీకరించేందుకు పూనుకున్నారు. 'కాలం చెల్లిన సంస్కృతంతో హిందీని సజీవం చేయాలనుకోవడం మొరటు ప్రయత్నం' అని భాషా నిపుణులు చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి హిందీ రాష్ట్రాల్లో అవధి, భోజ్‌పురి, మైథిలి, మగధ వంటి భాషలు మాట్లాడేవారే అధికం. ఈ భాషల్లో సుసంపన్నమైన సాహిత్యం విలసిల్లింది. 'రామ్‌చరిత మానస్'ను తులసీదాస్ అవధి భాషలోనే రాశారు. ఇలాంటి సాహితీ సంపద కలిగిన భాషలన్నిటినీ హిందీలో కలిపేశారు. అయినా...హిందీ యేతర భాషలు మాట్లాడేవారు 60 శాతం పైగా వుండటం గమనార్హం. అయినా, హిందీని రాష్ట్రాలపై రుద్దుతూ పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదన చేయడమంటే, దేశ వైవిధ్యంపై ప్రత్యక్ష దాడికి పూనుకోవడమే.

గతంలో స్థానిక భాషలతో పాటు 'కర్డ్' అన్న ఆంగ్ల పదానికి బదులుగా 'దహీ' అన్న హిందీ పదం వాడాలని ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఆదేశించడం...హిందీని బలవంతాన రుద్దడమేనని తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు 'నహీ టు దహీ' అనే నినాదాన్ని ముందుకు తెచ్చాయి. తాజాగా జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపి)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు-కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఎన్‌ఈపి పేరుతో తమపై హిందీని బలవంతంగా రుద్దేందుకే ప్రయత్నిస్తున్నారని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేశారని తమిళనాడు గట్టిగా చెబుతోంది. స్థానిక మాతృభాషతో పాటు హిందీని అధికారిక భాషగా గుర్తించడం వల్ల స్థానిక యువతకు ఒరిగేదేమీ లేదని, మారుతున్న ప్రపంచానికి ఆంగ్లభాష అవసరం గురించి అన్ని రాష్ట్రాలూ చెబుతున్నాయి. ఇప్పటికే దేశంలోని విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర భయాందోళనలతో వున్నారు. యువతకు నష్టం జరిగే ఎలాంటి ప్రయత్నమూ సమాజానికి మేలు చేయదని విశ్లేషకులూ చెబుతున్నారు. గతంలో జరిగిన హిందీ వ్యతిరేక ఆందోళనల నుంచి బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకుంటే దేశ ఐక్యతకు, భారతీయత బలోపేతానికి మార్గం సుగమం అవుతుంది. లేదంటే... దేశంలో భాషా బేధాలు తలెత్తే అవకాశం వుంది.

మహనీయుల మాట




ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగంతోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

సనాతనం చాటున బిజెపి చొరబాటు

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ప్రమాణ స్వీకారానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో ప్రధాని మోడీ ముచ్చట్లను దేశమంతా చూసింది. పవన్ విలాసంగా వినోదంగా స్పందించగా చంద్రబాబు వినమ్రంగా ప్రత్యేక గౌరవంతో ప్రతిస్పందించడం కూడా కనిపించింది. ఈ ఘట్టానికి ముందు పవన్ మూడు అడుగులు గుర్తు చేసుకోవాలి. దక్షిణాది తీర్థయాత్ర, మహాకుంభలో స్నానం-బిజెపి వ్యతిరేక నేతలపై దాడి, వెంటనే ఢిల్లీలో ప్రత్యక్షం కావడం ఒక వరుసలోవే. ఆ వేదికపై మోడీ ఆయనను అడిగిన ప్రశ్న కూడా మతానికి యాత్రలకు సంబంధించిందే. అచ్చంగా ఇలాగే మోడీ కూడా కేదారనాథ్ గుహలోనో అమరనాథ్‌లోనో ప్రత్యక్షం కావడం, ఢిల్లీ ఎన్నికల రోజే కుంభమేళాలో స్నానం చేసిన దృశ్యాలు ఇక్కడ గుర్తు చేసుకోవాలి. హిమాలయాలకు వెళతావా అని ప్రధాని అడగడం నిజానికి వెళ్లమని చెప్పడమే కావచ్చు. ఆ విధంగా చూస్తే ఇది కేవలం ఆంధ్రప్రదేశ్‌కే మాత్రమే పరిమితమైన సమస్య కాదు.

కాస్త వెనక్కు వెళితే తిరుపతి లడ్డూ సమస్యపై ప్రాయశ్చిత్త దీక్ష, తొక్కిసలాట ఘటనపై క్షమాపణలతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సనాతన రాజకీయాల ప్రతినిధిగా ముందుకు రావడమేగాక ప్రభుత్వ పరంగా తన మాట ప్రత్యేకంగా వినిపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లతో సహా మిగిలిన వారు వ్యవహరించిన, మాట్లాడిన తీరుకు ఇది కొంత భిన్నం (తాజాగా శ్రీవారి ఆలయంలోనే ఉద్యోగిని దుర్భాషలాడిన కర్ణాటక బిజెపికి చెందిన టిటిడి సభ్యుడిపై మాత్రం ఇంకా స్పందించలేదు). చంద్రబాబు అనుభవంపై అపార గౌరవం ప్రకటిస్తూనే తన స్వంత ముద్ర కోసం పవన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని టిడిపి నేతలు గట్టిగా చెబుతున్నారు. మూడు నాలుగు సందర్భాలలో హోంశాఖ పనితీరుపై వ్యాఖ్యానాలు, విసుర్లు సాగించడం కూడా యాదృచ్ఛికం కాదు. లోకేశ్ పాత్రపై పదేపదే చర్చ రావడం, ఆయన అనుయాయుల ప్రతిస్పందన కూడా ఇందులో భాగం కావచ్చు. ఆఖరుకు సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు కూడా లోకేశ్ మా తదుపరి నాయకుడని ప్రకటించేశారు. టిడిపి నేతలు మా వల్ల మళ్లీ అధికారంలోకి వచ్చి మమ్మల్నే నిర్లక్ష్యం చేస్తున్నారని కొందరు జనసేన నాయకులు అంటుంటే మీ 11 శాతం ఓటింగుకు మించిన పదవులు, వనరులు, ఫోకస్ ఇచ్చామని టిడిపి వర్గాలు కొన్ని అదే స్థాయిలో సమాధానమిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ప్రతి సందర్భంలోనూ మిగిలిన వారందరికీ అతీతుడుగా వున్నట్టు ఫోకస్‌లో వుండే ప్రయత్నం చేస్తున్నారని టిడిపిలో కీలక స్థానాల్లో వున్నవారే వ్యాఖ్యాస్తున్నారు.

వ్యక్తుల మధ్య వైరుధ్యమేనా?

చంద్రబాబు నాయుడు అనేక కారణాల వల్ల పవన్‌కు అధికతర ప్రాధాన్యత కల్పించడంతో జాతీయ కార్యదర్శి లోకేశ్ ప్రచారం తగ్గుతుందనే భావం టిడిపిలో నెలకొంది. లోకేశ్ స్థానానికీ పవన్‌పై ఫోకస్‌కూ వైరుధ్యం వల్లనే భిన్న సంకేతాలు వస్తున్నాయని అనేక మంది అంటున్నా అదే ఏకైక సమస్య కాదు. ఎందుకంటే ఆ వారసత్వ వాస్తవం పవన్ కళ్యాణ్‌కే గాక దేశమంతటికీ తెలుసు. లోకేశ్ కన్నా ముందు నారా భువనేశ్వరిని రెండో స్థానంలోకి తేవాలనే బలమైన ఆలోచన కూడా టిడిపికి వుంది. ఇటీవల ఆ సంకేతాలు కనిపిస్తున్నాయి కూడా. అందువల్ల ఇది పవన్ రేపటి స్థానానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. లోతైన రాజకీయ వ్యూహాత్మక కారణాలే దీనివెనక వున్నాయి. తన రాజకీయ భవిష్యత్తును బిజెపితో ముడి పెట్టుకున్న పవన్ సనాతన మంత్రాన్ని తీసుకోవడం, మోడీతో సహా బిజెపి నాయకత్వం ఆయనపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఒక పథకం ప్రకారమే జరుగుతున్నది.

టిడిపి కీ టెండర్

మోడీ ప్రభుత్వానికి పెద్ద మద్దతుదారు టిడిపి అయినా ఎ.పి కి కేంద్రం పెద్దగా ఒరగబెడుతున్నదేమీ లేదు. పైపెచ్చు కష్ట కాలంలో జగన్ నుంచి కాపాడి చంద్రబాబును మళ్లీ గద్దెక్కించినందుకు తమను మోయవలసిందేనన్న ఆలోచనలో బిజెపి వుంది. పురందేశ్వరి హయాంలో చంద్రబాబు తమ పార్టీని అదుపు చేస్తున్నారనే ఆగ్రహం బిజెపి నేతలది. కేంద్రంలో నడ్డా తర్వాతి అధ్యక్షుడు నిర్ణయమై ఆ తర్వాత ఎ.పి, తెలంగాణ బిజెపి అధ్యక్షుల నియామకం కూడా జరిగితేగానీ ఈ విషయంలో స్పష్టత రాదు. ఎక్కడైనా సరే పొత్తు పెట్టుకున్న పార్టీలను నెమ్మదిగా చప్పరించడం బిజెపి వ్యూహంగా వుంటోంది. ఇక్కడ వారికి పవన్ కళ్యాణ్ ఆకర్షణీయమైన తోడుగా వున్నారు. రజనీకాంత్, చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్‌ల కోసం ప్రయత్నించి విఫలమైన బిజెపికి ఇది చాలా ఇష్టమైన పరిణామం. నిజానికి చిరంజీవి కూడా తాను రాజకీయాల్లోకి రాదలుచుకోలేదంటూనే పవన్ తన ఆశలు నెరవేరుస్తాడని ప్రకటించారు. రాజకీయాల్లోకి రాకున్నా తను తలపెట్టిన పనుల కోసం పెద్దపెద్ద వారిని కలుస్తూనే వుంటానని కూడా స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలకు ముందు ఆయన సంక్రాంతి సంబరాల పేరిట ఢిల్లీలో మోడీతో కలసివుండటం, మరో తమ్ముడు నాగబాబుకు మంత్రి పదవి హామీ గుర్తు చేసుకుంటే మొత్తం ఆ కుటుంబం మోడీతో బంధం వేసుకున్న తీరు తెలుస్తుంది.

తనతో పొత్తు పెట్టుకున్న పార్టీలను బిజెపి చప్పరించిన తీరు రాజకీయాలు తెలిసినవారందరికీ తెలుసు. అయినా దానికి రాయబారిగా పవన్ కళ్యాణ్ సిద్ధమైపోయారు. చంద్రబాబును మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలుకు పంపించిన సమయంలోనే బిజెపి ఎ.పి అధ్యక్షురాలైన పురందేశ్వరితో పాటు లోకేశ్ అమిత్‌షాను కలసి ఒప్పందం కుదుర్చుకున్నారనే అభిప్రాయం వుంది. బిజెపితో కలిసినా ముస్లిం ఓట్లు కాపాడుకోవాలని చంద్రబాబు ద్వంద్వ వ్యూహం. కాగా చంద్రబాబు కుటుంబాన్నే శాశ్వతంగా మోయలేం గనక తమ విస్తరణ చూసుకోవాలనేది జనసేన వ్యూహం. ఆ ఆశలను వాడుకుని తను ఎదగాలనేది బిజెపి పథకం. పవన్ చాటున బిజెపి అల్లుకుపోతే ఎలా అనే ప్రశ్న టిడిపి నేతలది. పాలక పార్టీల ప్రయోజనాల ఘర్షణ దాంతోపాటే సామాజిక సమీకరణాల సంఘర్షణ వీటి వెనక వుందనేది కాదనలేని నిజం. బిజెపి మత రాజకీయాలు తెలిసినవే గానీ తమ మనుగడ కోసం దాన్ని అంటకాగడానికి సిద్ధమైన టిడిపి, ఈ కలయికతో తనకో స్థానం పొందిన జనసేన ఈ వ్యూహాల ఉచ్చులో రాష్ట్రాన్ని చిక్కిస్తున్న తీరే ఆందోళనకరమైంది. మరీ ముఖ్యంగా పవన్ అయితే ఎన్నికల తర్వాత సనాతన ధర్మం తప్ప రాష్ట్రం గురించి మాట్లాడింది చాలా తక్కువ. విశాఖ ఉక్కు వంటి అంశాలపైన అరకొర ప్యాకేజీలకు ప్రశంసలు తప్ప పూర్తిగా ఒత్తిడి పెట్టింది లేదు.

దక్షిణాది పాచిక

ఉప ముఖ్యమంత్రి దక్షిణ భారత తీర్థయాత్ర కూడా వామపక్షాలకు నిలయమైన కేరళతోనూ, ఎన్డీఏ మరీ అధ్వానంగా వున్న తమిళనాడుతోనూ మొదలెట్టారు. అంటే బిజెపి దక్షిణాది విస్తరణ వ్యూహానికి, పవన్ కదలికలకు స్పష్టమైన సంబంధం కనిపిస్తుంది. ఆయన తదుపరి చిత్రం హరిహర వీరమల్లు చిత్రం కూడా కాషాయ పరంపరలో ఔరంగజేబ్‌పై పోరాటం వంటి కథనంతో వస్తుందట. వ్యక్తిగతంగా, సనాతన వ్యూహాల పరంగా పవన్ బిజెపి నేతలతో పూర్తిగా కలసి వ్యవహరిస్తున్న తీరు చూశాక ఆయన మోడీ బృందానికి ప్రియతమ ప్రచార తార అవుతారనే భావిస్తున్నారు. తమిళనాడులో సనాతనత్వంపై విమర్శ చేసిన ఉదయనిధి స్టాలిన్‌ను ఖండించడం ద్వారానే పవన్ ఈ మార్గంలో ప్రవేశించారు. దక్షిణాదిన కమల్ హాసన్, ప్రకాశ్‌రాజ్ వంటి వారు మోడీ మత రాజకీయాలపై నిరంకుశ దాడులపై నిశిత విమర్శలతో పోరాటం చేస్తుంటే చేగువేరా బొమ్మతో బయలుదేరిన పవన్ మోడీకి అధికారిక రాయబారిగా మారిపోవడం విచారకర పరిణామం. ఉత్తరాదిన కూడా సేవలందించేందుకు తాను సిద్ధమని మహాకుంభ స్నానంతో ప్రకటించుకుని మరీ ఆయన ఢిల్లీ వెళ్లారు. పవన్ అత్యుత్సాహం ఎలా వున్నా బిజెపి ఆయనను పావుగా వాడుకోవడం తథ్యం.

కె.సి.ఆర్, జగన్ దోహదం

దక్షిణ భారతంలో తెలంగాణపై బిజెపి నేతలకు చాలా ఆశ వుంది. అధికారంలోకి వచ్చినా రాకున్నా కీలక శక్తిగా అవతరించగలమని ఆశ పడుతున్నారు. తెలుగు హీరోగా పవన్ ఇందుకు ఉపయోగపడగలడు గానీ ఆంధ్ర, తెలంగాణ కోణాలు కూడా ఆలోచనకు వస్తున్నాయంటారు. బిజెపి విషయంలో బి.ఆర్.ఎస్ అధినేత కె.సి.ఆర్‌తో సహా అస్పష్టంగా అనుమానాస్పదంగా మాట్లాడుతున్నారు. తాజాగా కృష్ణా జలాల పంపిణీ విషయంలో ఎ.పి, తెలంగాణ ప్రభుత్వాల భిన్నాభిప్రాయాలను కూడా చంద్రబాబు ట్రాప్‌గా చెబుతున్నారే గానీ కేంద్ర బిజెపిని అనడం లేదు. ఎ.పి లో టి.డి.పి కూటమి సర్కారు వచ్చాక విభజన సమస్యలు వేగంగా పరిష్కరించేస్తామని హడావుడి చేసిన కేంద్రం ఎందుకు మౌనంగా వుందని ఉభయులూ అడగడం లేదు. తెలంగాణలో శాసనమండలి ఎన్నికలలో కూడా కాంగ్రెస్‌ను ఓడించాలని తప్ప బిజెపిని ఓడించడం గురించి మాట్లాడటం లేదు. దాదాపు ఆరు మాసాల తర్వాత తెలంగాణ భవన్ సందర్శించిన కెసిఆర్ ప్రసంగంలో టార్గెట్ మొత్తం కాంగ్రెస్ తప్ప బిజెపి మాట లేదు. బిఆర్‌ఎస్ స్థాపనకు ముందు మోడీపై నిప్పులు కక్కిన కెసిఆర్ ఈయనేనా అని సందేహం కలిగే పరిస్థితి. కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు విశృంఖల విమర్శలు చేస్తున్నా స్పందన లేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా మత రాజకీయాలపై కేంద్ర నిరంకుశత్వంపై పోరాటంలో ఇతరులను కలుపుకొని పెద్దగా పోరాడుతున్నదేమీ లేదు. వైసిపి అధినేత జగన్ ఎన్నడూ బిజెపి జోలికే పోరు.

భాగ్యలక్ష్మి ఆలయ వివాదం, భగవద్గీతపై దాడి వంటి దుశ్చర్యలు చూసిన తెలంగాణలో ఏకంగా చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులైన రంగరాజన్ కుటుంబంపై రామరాజ్యం పేరిట దాడి జరిగే విపరీత పరిస్థితి. ఆలస్యంగా అర్ధమనస్కంగా ఖండించడం తప్ప దీనిపైనా పెద్ద స్పందించిందేమీ లేదు. బిజెపి ఎంఎల్‌ఎ రాజా సింగ్ షరమామూలుగా రామరాజ్యం దౌర్జన్యాన్ని సమర్థించడమే గాక తమ పార్టీ పైనే విరుచుకు పడుతున్నారు. మత విద్వేషం ప్రబలితే స్వమతం పైనే దాడికి వెనుకాడదనడానికి ఇది మరో ఉదాహరణ. విజయవాడలో హైందవ శంఖారావం విద్వేష ప్రసంగాలు గుర్తు చేసుకుంటే ఈ పరిణామాల మధ్యలో లింకేమిటో తెలుస్తుంది. రామాయణంలో సీత పట్ల కరుణ చూపడం, భారతంలో కర్ణుడి ప్రత్యేకత చెప్పడం కూడా తప్పయినట్టు అక్కడ ప్రసంగాలు సాగాయి. శంఖారావం ప్రసంగంలోనూ రామరాజ్యం దాడులలోనూ ఉమ్మడి లక్షణం ఏమంటే కుల వివక్షత. ఆ విధంగా చూస్తే సనాతన వ్యూహాల విమర్శకుల హెచ్చరికలు ఎంత నిజమో అర్థమవుతుంది. చాప కింద నీరులాగా బిజెపి ఆరెస్సెస్ చొరబడుతున్న తీరు నిజానికి దక్షిణాదిపై దండయాత్ర లాంటిదేనని గుర్తించి అప్రమత్తం కావడం లౌకికవాదుల కర్తవ్యం.



లోకేశ్ స్థానానికీ పవన్‌పై ఫోకస్‌కూ వైరుధ్యం వల్లనే భిన్న సంకేతాలు వస్తున్నాయని అనేక మంది అంటున్నా అదే ఏకైక సమస్య కాదు. ఎందుకంటే ఆ వారసత్వ వాస్తవం పవన్ కళ్యాణ్‌కే గాక దేశమంతటికీ తెలుసు. లోకేశ్ కన్నా ముందు నారా భువనేశ్వరిని రెండో స్థానంలోకి తేవాలనే బలమైన ఆలోచన కూడా టిడిపికి వుంది. ఇటీవల ఆ సంకేతాలు కనిపిస్తున్నాయి కూడా. అందువల్ల ఇది పవన్ రేపటి స్థానానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. లోతైన రాజకీయ వ్యూహాత్మక కారణాలే దీనివెనక వున్నాయి. తన రాజకీయ భవిష్యత్తును బిజెపితో ముడి పెట్టుకున్న పవన్ సనాతన మంత్రాన్ని తీసుకోవడం, మోడీతో సహా బిజెపి నాయకత్వం ఆయనపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఒక పథకం ప్రకారమే జరుగుతున్నది.

తనతో పొత్తు పెట్టుకున్న పార్టీలను బిజెపి చప్పరించిన తీరు రాజకీయాలు తెలిసినవారందరికీ తెలుసు. అయినా దానికి రాయబారిగా పవన్ కళ్యాణ్ సిద్ధమైపోయారు. చంద్రబాబును మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలుకు పంపించిన సమయంలోనే బిజెపి ఎ.పి అధ్యక్షురాలైన పురందేశ్వరితోపాటు లోకేశ్ అమిత్‌షాను కలసి ఒప్పందం కుదుర్చుకున్నారనే అభిప్రాయం వుంది. బిజెపితో కలిసినా ముస్లిం ఓట్లు కాపాడుకోవాలని చంద్రబాబు ద్వంద్వ వ్యూహం. కాగా చంద్రబాబు కుటుంబాన్నే శాశ్వతంగా మోయలేం గనక తమ విస్తరణ చూసుకోవాలనేది జనసేన వ్యూహం. ఆ ఆశలను వాడుకుని తను ఎదగాలనేది బిజెపి పథకం. పవన్ చాటున బిజెపి అల్లుకుపోతే ఎలా అనే ప్రశ్న టిడిపి నేతలది. పాలక పార్టీల ప్రయోజనాల ఘర్షణ దాంతోపాటే సామాజిక సమీకరణాల సంఘర్షణ వీటి వెనక వుందనేది కాదనలేని నిజం. బిజెపి మత రాజకీయాలు తెలిసినవే గానీ తమ మనుగడ కోసం దాన్ని అంటకాగడానికి సిద్ధమైన టిడిపి, ఈ కలయికతో తనకో స్థానం పొందిన జనసేన ఈ వ్యూహాల ఉచ్చులో రాష్ట్రాన్ని చిక్కిస్తున్న తీరే ఆందోళనకరమైంది.

విశృంఖలమవుతున్న విద్వేషపూరిత ప్రసంగాలు

వ్యాఖ్య

కుల, మతాల తేడా లేకుండా స్నేహం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసిన నేల మన భారతదేశం. ఐకమత్యమే మహాబలంగా మెలిగిన ఇక్కడి ప్రజల మధ్యకు పాలకుల ద్వేషపూరిత ప్రసంగాలు చొచ్చుకుపోతున్నాయి. విద్వేషాన్ని విషంలా నింపేస్తూ, దేశాన్ని ఎంతలా నాశనం చేస్తున్నారో చెప్పడానికి 'ద ఇండియా హేట్ లాబ్ (ఐ.హెచ్.ఎల్) నివేదిక వెల్లడించిన వాస్తవాలు మన కళ్ల ముందు ఉన్నాయి. 2023తో పోల్చినప్పుడు 2024లో ఈ ధోరణి బాగా ఎక్కువైందని నివేదిక స్పష్టం చేసింది.

గతేడాది ఏప్రిల్, జూన్ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఆ ఏడాది చివర్లో నిర్వహించిన మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో పాలక పార్టీలు చేసిన ప్రసంగాలు ఈ విద్వేష ప్రచారాల వ్యాప్తికి కీలకంగా పనిచేశాయి.

ఈ నివేదిక కేవలం సంఖ్యలను మాత్రమే నమోదు చేయలేదు. ద్వేషపూరిత ప్రసంగాలు తీవ్రతరం కావడం, వాటి వెనుక ఉన్న ఉద్దేశపూర్వక వ్యూహాలు, కీలక పాత్రధారులు, సైద్ధాంతిక ప్రేరణలను బహిర్గతం చేస్తుంది. 2024లో ద్వేషపూరిత ప్రసంగ నమూనాలలో అత్యంత ముఖ్యమైన అంశం బిజెపి, దాని సైద్ధాంతిక అనుబంధ సంస్థల ప్రత్యక్ష ప్రమేయం. ఈ ఎన్నికల్లో మునుపటి ధోరణికి బదులుగా రాష్ట్ర, కేంద్ర స్థాయి బిజెపి నాయకులు సైతం మతపరమైన తీవ్రవాదాలను నడిపించారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వంటి వారు చేసిన ద్వేషపూరిత ప్రసంగాలను దేశం చూసింది.

ద్వేషపూరిత ప్రసంగాలు చేసే బిజెపి అతి పెద్ద పార్టీగా అవతరించింది. బిజెపి ప్రత్యక్షంగా పాల్గొన్న 340 సమావేశాలను పరిశీలిస్తే, విద్వేష ప్రచారాలు చేసినందుకు నమోదైన కేసులు 29.2 శాతం. ఇది గతేడాది కంటే భారీ పెరుగుదలగా నివేదిక అభిప్రాయపడింది. అయితే పాలక పార్టీ దీన్ని అంత తేలికగా ఒప్పుకోలేదు. కేవలం 50 సంఘటనల్లో మాత్రమే బాధ్యత వహించింది. వాస్తవానికి సార్వత్రిక ఎన్నికల సమయంలో బిజెపి చేసిన ద్వేషపూరిత ప్రసంగాలు 76.7 శాతం వున్నాయి.

బిజెపితో పాటు విశ్వహిందూ పరిషత్, దాని అతివాద యువజన విభాగం బజరంగ్‌దళ్ వంటి సంస్థలు కూడా ద్వేషాన్ని ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ గ్రూపులు పాల్గొన్న 279 కార్యక్రమాల్లో విద్వేష ప్రసంగాలు చేశాయి. ఈ సంఖ్య గత సంవత్సరం కంటే చాలా ఎక్కువ. మహారాష్ట్రకు చెందిన 'సకల్ హిందూ సమాజ్' 56 ద్వేషపూరిత ప్రసంగాలకు బాధ్యత వహించింది. సురేష్ చవాంకే, కాజల్ హిందుస్తానీ, బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్, నితీష్ రాణే వంటి కరడుగట్టిన మతతత్వం తలకెక్కిన వక్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

2024 ఏప్రిల్ 21న రాజస్థాన్ బన్స్వారాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ముస్లింలను 'చొరబాటుదారులు'గా పేర్కొంటూ, వారు హిందువుల సంపదను, వనరులను దోచుకుంటారని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ఇది దేశవ్యాప్తంగా అనేక ద్వేషపూరిత ప్రసంగాలకు, సంఘటనలకు దారి తీసింది. ఎన్నికల కాలంలో 373 ద్వేషపూరిత ప్రసంగాల సంఘటనలు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ ఎక్కువగా ప్రభావితమయ్యాయి.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక్కరే 58 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారు. ఆయన తరచూ 'ఓట్ జిహాద్', 'ల్యాండ్ జిహాద్' బెదిరింపులను ప్రేరేపిస్తున్నారు. ఇక యోగి 86 ద్వేషపూరిత ప్రసంగాలకు నాయకత్వం వహించారు. సగటున ప్రతి నాలుగు రోజులకు ఒకటి చొప్పున చేశారు. ముస్లింలు, క్రైస్తవులే లక్ష్యంగా ఈ ప్రసంగాలు సాగాయి. ఈ ఎన్నికల్లో బిజెపి వ్యూహం చాలా స్పష్టంగా కనిపించింది. దేశ ప్రజల్లో భయం, మతపరమైన ఆగ్రహాన్ని వ్యాప్తి చేయడంపై బిజెపి ఎక్కువగా ఆధారపడింది. ప్రతిపక్షాలు హిందువుల ఆస్తులను లాక్కొని 'బంగ్లాదేశ్ చొరబాటుదారులకు, రోహింగ్యా శరణార్థులకు' ఇస్తాయని మోడీ, యోగి, అమిత్ షా పదే పదే పేర్కొన్నారు. ఈ ప్రసంగాలు మూకదాడులు, మత అల్లర్లు, వ్యవస్థాగత వివక్షకు దారితీశాయి.

సోషల్ మీడియా పాత్ర

2024లో ద్వేషపూరిత ప్రసంగాలు బహిరంగ సభలకే పరిమితం కాలేదు. ప్రధాన స్రవంతిలోకి తీసుకుపోవడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించింది. కొద్ది సెకన్ల వ్యవధిలోనే లక్షలాది మందికి చేరేలా చేసింది. ఐహెచ్‌ఎల్ నివేదిక ప్రకారం 995 వ్యక్తిగత ద్వేషపూరిత ప్రసంగాల వీడియోలను ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ఆన్‌లైన్ సంస్థలు వాటి అసలు మూలాలకు ట్రాక్ చేశాయి. ఫేస్‌బుక్ ఒక్కటే 495 వీడియోలను హోస్ట్ చేసింది. 211 యూట్యూబ్‌లో కనిపించాయి. అంతేగాక బిజెపి నాయకులు చేసిన 266 మైనారిటీ వ్యతిరేక ద్వేషపూరిత ప్రసంగాలు బహుళ వేదికల్లో ఒకేసారి ప్రత్యక్ష ప్రసారం అయ్యాయి. అమానవీయత నుండి హింసకు పిలుపుల వరకు మొత్తం 1,165 ద్వేషపూరిత ప్రసంగాల్లో 1,147 ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారని ఐ.హెచ్.ఎల్ నివేదిక వెల్లడించింది.

ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, ఇతర బిజెపి నాయకులు ఎన్నికల ప్రసంగాల్లో ద్వేషపూరిత కథనాలను ప్రోత్సహించారు. తద్వారా దాడులకు, నేరాలకు ఆజ్యం పోశారు. హింస, సామాజిక బహిష్కరణలకు ప్రత్యక్ష పిలుపులు ఇచ్చిన ప్రసంగాలు కూడా వీటిలో ఉన్నాయి. ముస్లింలపై హింసకు స్పష్టంగా పిలుపునిచ్చిన 259 ద్వేషపూరిత ప్రసంగాలను నివేదిక నమోదు చేసింది.

ముస్లిం వ్యాపారాలపై ఆర్థిక బహిష్కరణలను సమర్థిస్తూ 111 ప్రసంగాలు, మసీదులు, ముస్లిం గృహాలను నాశనం చేయాలని పిలుపునిస్తూ 274 ప్రసంగాలు, హిందువులు ముస్లింలకు వ్యతిరేకంగా ఆయుధాలు చేపట్టాలని కోరుతూ 123 ప్రసంగాలు చేశారని నివేదిక పేర్కొంది.

ఉత్తరాఖండ్‌లో జరిగిన వి.హెచ్.పి ఆయుధ పూజ కార్యక్రమంలో ఒక వక్త అత్యంత దారుణమైన ప్రసంగం చేశాడు. 'హిందువులు కాని వారిని చంపడం మోక్షానికి దారి తీస్తుంద'ని బహిరంగంగా ప్రకటించాడు. గతేడాది చేసిన ప్రసంగాల్లో ముస్లిం వ్యతిరేక ద్వేషపూరిత ప్రసంగాలు మాత్రమే కాదు. క్రైస్తవ వ్యతిరేకత కూడా గణనీయంగా పెరిగింది. 115 ద్వేషపూరిత ప్రసంగాలు క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నవిగా నివేదిక నమోదు చేసింది. మార్చి 2024లో అస్సాంలోని హిందూ జాతీయవాద గ్రూపులు క్రైస్తవులు నిర్వహించే పాఠశాలల్లో శిలువలు, మతపరమైన చిహ్నాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ బెదిరింపులు పోస్ట్ చేశాయి. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన రాష్ట్రీయ బజరంగ్ దళ్ కార్యక్రమంలో నాయకులు కాథలిక్ పాఠశాలలపై దాడులకు పిలుపునిచ్చారు. వాటిని 'మత మార్పిడి కేంద్రాలు'గా ముద్ర వేశారు. ఈ రకంగా ద్వేషపూరిత ప్రసంగాలు మూకదాడులకు, బలవంతపు 'పున:మార్పిడి' సంఘటనల పెరుగుదలకు దారితీసింది.

ఇండియా హేట్ ల్యాబ్ 2024 నివేదికలోని వివరాలు ఒక భయంకరమైన వాస్తవాన్ని సూచిస్తున్నాయి. విద్వేష ప్రసంగం అనేది ఉద్దేశపూర్వక రాజకీయ ప్రాజెక్ట్. ఇది ముస్లింలను, క్రైస్తవులను అణగదొక్కడానికి, భారతదేశ ప్రజాస్వామ్య చట్రాన్ని అణగదొక్కడానికి రూపొందించబడింది. ఈ ద్వేషం సృష్టించిన పరిణామాలు రాబోయే సంవత్సరాల్లో మరింత పెరుగుతాయన్న ఆందోళనను నివేదిక వ్యక్తపరిచింది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్



బిజెపితో పాటు విశ్వహిందూ పరిషత్, దాని అతివాద యువజన విభాగం బజరంగ్‌దళ్ వంటి సంస్థలు కూడా ద్వేషాన్ని ప్రచారం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ గ్రూపులు పాల్గొన్న 279 కార్యక్రమాల్లో విద్వేష ప్రసంగాలు చేశాయి. ఈ సంఖ్య గత సంవత్సరం కంటే చాలా ఎక్కువ. మహారాష్ట్రకు చెందిన హిందూ జాతీయవాద సంస్థల కూటమి 'సకల్ హిందూ సమాజ్', 56 ద్వేషపూరిత ప్రసంగాలకు బాధ్యత వహించింది.

జనవాక్యం

వీధి కుక్కలతో భయం భయం

శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి ప్రాంతంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. ప్రజలు భయంతో బహిరంగ ప్రదేశాల్లో సంచరించలేని పరిస్థితి ఏర్పడింది. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు రహదారిపై వెళ్లడం కూడా ప్రమాదకరంగా మారింది. ఎందుకంటే వీధి కుక్కలు ఆకస్మికంగా దాడి చేస్తుండటంతో అనేకమంది గాయపడుతున్నారు. ఇటీవలే రేబిస్ సోకిన కుక్కలు పలువురిపై దాడి చేసి, తీవ్ర గాయాలేర్పరిచాయి. ఈ కారణంగా ప్రజల్లో భయం పెరుగుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని, వీధి కుక్కలను పట్టి టీకాలు వేయించాలని, రోగగ్రస్తమైన కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే, పరిస్థితి మరింత విషమించి ప్రజల ఆరోగ్యా నికి, భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు ఈ విషయంలో వెంటనే స్పందించి సమర్థవంతమైన చర్యలు తీసుకో వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- పి. రాజు,
అదిత్య నగర్ కాలనీ,శ్రీకాకుళం జిల్లా.



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

సాగును సులభతరం చేస్తాం

- రైతు బడి అగ్రి ఎక్స్‌పోలో మంత్రి, ఎమ్మెల్యేలు
- రాప్తాడు సమీపంలో రైతు బడి అగ్రి ఎక్స్ పోకు స్పందన
- వేలాదిగా తరలొచ్చిన రైతులు

ప్రజాశక్తి -రాప్తాడు

వ్యవసాయ సాగును సులభతరం చేసి, రైతుకు మేలు చేసేలా ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటును అందిస్తోందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితతో పాటు పలువురు ఎమ్మెల్యేలు తెలియజేశారు. రాప్తాడు సమీపంలో రైతుబడి సంస్థ అగ్రి ఎక్స్ పో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రైతుబడి వ్యవస్థాపకులు రాజేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో సుమారు 300 కంపెనీలు పాల్గొన్నాయి. 700 అత్యాధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఆధునిక వ్యవసాయం.. ఎరువుల వాడకం.. తదితర అంశాలను వివరిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, అమిలినేని సురేంద్ర, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌తో పాటు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చడమే కాకుండా హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. గత ఐదేళ్లలో రైతుల గురించి ఏ మాత్రం పట్టించుకోని జగన్ ఇప్పుడు ఏదో రైతులపై ప్రేమ ఉన్నట్టు నటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సాంప్రదాయ వ్యవసాయానికి ఆధునికత జోడిస్తూ సాగును సులభతరం చేయడమే కాకుండా రైతులకు మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. సాంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికత జోడించి అధిక దిగుబడులు, రైతులకు లాభం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండు రోజుల పాటు జరిగే ప్రదర్శనను ప్రతి రైతు సందర్శించాలని కోరారు.

పరీక్షకు సెలవు ఇవ్వలేదని ఎఎన్ఎం ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - చాపాడు

పరీక్షకు సెలవు ఇవ్వలేని ఎఎన్ఎం మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన వైఎస్ఆర్ జిల్లా చాపాడు మండలంలోని నక్కలదిన్నె పిహెచ్‌సి పరిధిలోని అయ్యావారిపల్లె సచివాయంలో చోటు చేసుకుంది. వివరాలు... అయ్య వారిపల్లె సచివాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సింధూకు ఈనెల 24న ఎస్‌వి ఓపెన్ యూనివర్సిటీ మూడవ సంవత్సరం పరీక్షలున్నాయి. ఈ సందర్భంగా తనకు సెలవు కావాలని రెండు రోజులుగా వైద్యాధికారి కావ్య మాధురిని ఆమె అడిగారు. ఎంఎల్‌హెచ్‌పి ఉష అనుమతిస్తే తీసుకోవచ్చుని లేదంటే లేదని వైద్యాధికారి చెప్పారు. ఎమ్ఎల్‌హెచ్‌పి సెలవు అడిగితే తనకు ఎలాంటి సంబంధం లేదని, సెలవుపై వెళ్తే ఎవరు పనులుచేస్తారని హేళనగా మాట్లాడారని బాధితురాలు వాపోయారు. 'నీకు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం ఉంది కదా..డిగ్రీలు అవసరమా.. పరీక్షలు ఎప్పుడైనా రాసుకోవచ్చు.. సెలవు ఇవ్వను' అని వైద్యాధికారి కావ్య మాధురి తేల్చి చెప్పారు. దీంతో మనస్థాపానికి గురైన ఎఎన్ఎం గాజులతో చెయ్యి కోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. సాయంత్రం 3.40 గంటలకే సిబ్బంది పిహెచ్‌సి మూత వేసి వెళ్ళిపోయారు. స్థానికులు గుర్తించి 108 సహాయంతో వైద్య చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. చాపాడు మండల పరిధిలో ఎఎన్ఎంలకు కొన్ని నెలలుగా ఉన్నతాధికారులు సెలువలు ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేల పేరుతో సెలవులు ఇవ్వకుండా ఎంతటి అవసరమున్నా పనులు చేసుకోవాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. గత నెలలో ఈ ఎఎన్ఎం తన కుమారునికి ఆరోగ్యం సరిగా లేదని సెలువు అడిగినప్పటికీ ఇవ్వకపోవడంతో కడప డిఎంహెచ్ఒ దగ్గరికి వెళ్లి మంజూరు చేయించుకున్నారు. వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పిలతో ఇబ్బందులు పడుతున్నామని బాధితురాలు పేర్కొన్నారు.

రేషన్‌కార్డులపై వేటు !

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు ఇక లేనట్టే
- అత్యంత రహస్యంగా ప్రభుత్వ ఆపరేషన్
- లబ్ధిదారులకు కార్డుల తొలగింపుపై స్పష్టత కరవు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్‌కార్డుల తొలగింపుపై ప్రభుత్వ అత్యంత రహస్య ఆపరేషన్ కొనసాగించినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు తొలగించినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రేషన్‌కార్డుల తొలగింపు సమాచారం కార్డుదారులకైనా తెలుసా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు తెలిసే అవకాశం కన్పిస్తోంది. ప్రభుత్వం ఏ సర్వే ప్రకారం రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ చేపట్టిందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. చనిపోయిన వారి కార్డులు తొలగించి నట్లు పైకి చెబుతున్నా అందులో వాస్తవికతపై అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరు జిల్లాలోని 27 మండలాల పరిధిలో 1,123 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్‌లో ప్రభుత్వ డేటా ప్రకారం 6,31,044 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతినెలా ఈ కార్డుదారులు రేషన్ సరుకులు అందుకుంటున్నారు. ఫిబ్రవరి నెల ప్రభుత్వ డేటాలో ఏలూరు జిల్లాలోని రేషన్‌కార్డుల సంఖ్య 6,20,228కు తగ్గిపోయాయి. అంటే గడిచిన డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో ఏలూరు జిల్లావ్యాప్తంగా 10,816 రేషన్‌కార్డులు తొలగింపునకు గురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల పరిధిలో మొత్తం 1,052 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్ నెల డేటా ప్రకారం 5,67,651 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. ఫిబ్రవరిలో తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం కార్డుల సంఖ్య 5,58,070 మాత్రమే ఉన్నాయి. రెండు నెలల వ్యవధిలో 9,581 రేషన్‌కార్డులు మాయమయ్యాయి. రేషన్‌కార్డుల తొలగింపు ప్రక్రియను ఏవిధంగా జరిపారో.. ఏ ఒక్కరికీ అర్థం కావడం లేదు. అనర్హుల జాబితాను ఏవిధంగా తేల్చారో అర్థం కావడం లేదు. చనిపోయిన వారి కార్డులను తొలగించాలన్నా క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవాలంటే ఇ పోస్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. వేలిముద్ర వేయకపోతే సరుకులు తీసుకో వడం సాధ్యం కాదు. సరుకులు తీసుకోకపోతే రేషన్‌కార్డు పని చేయదు. ప్రత్యేకంగా తొలగించడం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది.

కొత్త కార్డులు లేవు.. ఉన్న కార్డులు పోయే..!

కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఉన్న రేషన్‌కార్డులను తీసేస్తున్న పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డుల తొలగింపుపై పలు అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు అసలు విషయం బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ అంతా ప్రభుత్వం వ్యూహాత్మకంగానే చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక హౌస్‌ఓల్డ్ మ్యాపింగ్ సర్వే మాత్రమే జరిగినట్లు చెబుతున్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ఎటువంటి సర్వే జరగలేదని అధికారుల మాటలు చెబుతున్నాయి. జిల్లాలో పి-4 సర్వే కూడా జరగలేదు. అటువంటప్పుడు దేని ఆధారంగా రేషన్‌కార్డుల సంఖ్య తగ్గిపోయిందో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. ఎంతోమంది వివాహమైన జంటలకు రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టకుండా ఉన్న కార్డులను తొలగించే చర్యలకు దిగడంపై అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది.

'ఉక్కు' నిర్వీర్యానికి కుట్రలు తీవ్రం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు కుట్రలను తీవ్రతరం చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1472వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటుపరం చేసే క్రమంలోనే కేంద్రం విఆర్ఎస్ సర్క్యులర్‌ను ముందుకు తెచ్చిందన్నారు. ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించి కార్పొరేట్ శక్తులకు ప్లాంటును కట్టబెట్టేందుకు కుటిలయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు.

తీరు మార్చుకోకుంటే అందరినీ ఐక్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు ఎ మసేన్‌రావు, జె రామకృష్ణ, తాండ్ర కనకరాజు, శివరామకృష్ణ, జి జయ, సోంబాబు, తుమ్మల శ్రీనివాస్, ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపి కూటమి నేతల భూ పంచాయితీ

- భాగస్వామ్యుల మధ్య సాగుతున్న మాటల యుద్ధం
- ఎవరికి వారు తమదే అంటూ ప్రకటనలు
- ముఖ్య నేతల మౌనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లా పెనుకొండ మండల పరిధిలోని గుట్టూరు గ్రామ పరిధిలో 250 ఎకరాల భూమిని 2011 గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ పేరుతో ఉత్తరాదికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేశారు. ఈ కంపెనీ నుంచి 2014లో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ మొదట అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ కొనుగోలు నడుస్తున్న క్రమంలో ఈ ప్రాంతంలో కియా పరిశ్రమ వస్తుందని భావించి తెలుగు దేశం పార్టీ అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బిజెపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిలు 2016లో గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ కొనుగోలుకు ముందుకొచ్చారు. ఆదినారాయణతో కలిసి ముగ్గురు భాగస్వామ్యులుగా కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో పల్లె రఘునాథరెడ్డి 40 శాతం వాటా, ఆదినారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు చెరి 30 శాతం వాటాతో ఉత్తరాది వ్యక్తులు డబ్బులు చెల్లించి సంస్థతోపాటు, ఆ సంస్థ పేరుమీదున్న 250 ఎకరాలను తమ పేరుపై మార్చుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ సంస్థలు డబ్బులు చెల్లించడంలో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్‌కు సంబంధించిన కొంత మంది వ్యక్తులను ఇందులో భాగస్వామ్యులు చేయాలని భావించారు. వారి వల్ల కూడా కాకపోవడంతో 2017లో ప్రభాకర్ అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ముందుకు రావడంతో కంపెనీలో ఆయన్ను డైరెక్టర్‌గా నియమించుకున్నారు. ఆ తరువాత అక్కడ భూముల ధరలు పెరగడంతో భాగస్వామ్యుల మధ్య వివాదాలు తలెత్తాయి. 2018 నుంచి భాగస్వామ్యుల మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. అనేక మార్లు స్థలం వద్దనే ఘర్షణలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి.

ముఖ్య నేతల మౌనం

ఈ భూ వివాదం విషయంలో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ, భాగస్వామి ప్రభాకర్‌లు ఇటీవలి కాలంలో పరస్పరం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఆరోపణలు చేసుకున్నారు. ఆరోపణలు చేస్తున్న ఆదినారాయణ బిజెపి పార్టీలో ఉన్నారు. ఆయన ఆరోపణలు చేస్తున్నది టిడిపి నాయకులు పల్లె రఘునాథ రెడ్డిపై కావడం గమనార్హం. మరో నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి బిజెపిలో ఉన్నారు. ఈ రకంగా అటు టిడిపి, ఇటు బిజెపి భాగస్వామ్యులుగా ఉన్న ఈ నేతల మధ్య భూ పంచాయితీ తారాస్థాయిలోనే నడుస్తోంది. ఇప్పటి వరకు ఈ విషయంపై ఆదినారాయణ, ప్రభాకర్‌లే పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ముఖ్య నేతలు మాత్రం ఈ విషయంపై ఏమీ స్పందించకపోవడం గమనార్హం.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం



ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ పట్టణంలోని ఉపాధ్యాయ దంపతుల ఇంట్లో గత నెల 20వ తేదీ జరిగిన ఓ చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు సిఐ రాఘవన్ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బండి నాగార్జున ఇంట్లో సోహెల్ అలియాస్ సమీర్‌ఖాన్ 47 తులాల బంగారం, రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో విచారణ చేపట్టగా అనంతపురం నగరానికి చెందిన సోహెల్ బెంగళూరులో స్థిరపడి చోరీలు చేస్తున్నట్లు కనిపెట్టారు. అమెజాన్, ఫ్లిప్ కార్డు ద్వారా కొనుగోలు చేసిన పరికరాలతో చోరీ చేసిన బంగారాన్ని కలిగించి బిస్కెట్‌గా మార్చి హైదరాబాద్‌లో రూ. 29 లక్షలకు విక్రయించాడు. అతడు కర్ణాటకలోని తుమకూరులో ఉన్నట్లు పసిగట్టి ఈ నెల 13వ తేదీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం కోర్టు అనుమతితో ఈ నెల 19వ తేదీ పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించారు. అలాగే హైదరాబాద్ వెళ్లి అతడు అమ్మిన దుకాణానికి వెళ్లి 350 గ్రాముల బంగారాన్ని(బిస్కెట్ రూపంలో) స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసిన ఉపాధ్యా యుడు నాగార్జునదే అన్నారు. మిగిలిన వంద గ్రాములు కుప్పంలో రెండు కేసుల్లో చోరీ చేసిన బంగారం అని తెలిపారు. అతడి నుంచి పల్సర్ బైక్, కీప్యాడ్, బంగారు ఆభరణాలు కరిగించడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కర్నాటక, ఆంధ్ర, తదితర ప్రాంతాల్లో పలు కేసులు ఉన్నాయనన్నారు. నిందితుడు సోహెల్‌కు రేచీకటి ఉందని, కేవలం పగటిపూటే చోరీలు చేసేవాడు.

ఎనిమిది నుంచి తుడా టవర్స్‌కు వేలం

- తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తుడా ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తుడా టవర్లకు మార్చి 8వ తేదీ నుంచి వేలం నిర్వహిస్తున్నట్లు తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ.. రాయలచెరువులోని తుడా టవర్స్ అందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు 13 అంతస్తుల్లో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. గ్రౌండ్, ఒకటో అంతస్తుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో ఆఫీసుల వినియోగానికి ఉపయోగిస్తామన్నారు. మిగిలిన అంతస్తుల్లో నివాసయోగ్యంగా 2, 3, 4 బెడ్‌రూమ్ ప్లాట్స్ నిర్మిస్తున్నామన్నారు. నివాసాలకు 230 ప్లాట్లు ఉంటాయన్నారు. 46 డబుల్, 152 త్రిబుల్, 32 నాలుగు బెడ్‌రూమ్ ప్లాట్లు ఉంటాయన్నారు. విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. వాణిజ్య సముదాయాలు, ప్లాట్లకు వేర్వేరుగా లిఫ్ట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2026, మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. మార్చి 8 వ తేదీ 2,3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10 వ తేదీ 6, 7 అంతస్తులకు, 11 వ తేదీ 8,9 అంతస్తులకు, 12 వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుండి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని అన్నారు.

పరస్పరం బందీల అప్పగింత

- ఆరుగురిని అప్పగించిన హమాస్
- 602మందిని విడుదల చేసిన ఇజ్రాయిల్



ఇజ్రాయిలీలను రెడ్‌క్రాస్ అధికారులకు అప్పగించేందుకు తీసుకువచ్చిన హమాస్

గాజా : కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా శనివారం ఆరుగురు ఇజ్రాయిల్ బందీలను హమాస్ రెడ్ క్రాస్‌కు అప్పగించింది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గుతున్న 602మంది పాలస్తీనా వాసులను ఇజ్రాయిల్ విడుదల చేసింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్, హెబ్రాన్ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ బలగాలు ఇద్దరు పాలస్తీనా చిన్నారులను కాల్చిచంపాయి. ఇప్పటివరకు గాజాలో 48,319మంది చనిపోగా, 1,11,749 మంది గాయపడ్డారు. గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం మాత్రం మృతుల సంఖ్యను 61.709కి పెంచింది. శిధిలాల కింద ఇరుక్కున్న వేలాదిమంది పాలస్తీనియన్లు ఇప్పటివరకు గల్లంతయ్యారన్న జాబితాలో వుంచామని, ఇప్పుడు వారందరూ చనిపోయినట్లుగా భావిస్తున్నామని తెలిపింది. ఒప్పందంలో భాగంగా మరికొద్ది గంటల్లో విడుదలవుతారని భావిస్తున్న పాలస్తీనా వాసులకు చెందిన నివాసాలపై ఇజ్రాయిల్ బలగాలు దాడులు జరిపాయి. తమ వారు విడుదలయ్యారని సంబరంగా కార్యక్రమాలు జరుపుకుంటే తీవ్ర పర్యవసానాలు వుంటాయని హెచ్చరించినట్లు పాలస్తీనా ఖైదీల మీడియా కార్యాలయం (ఎఎస్ఆర్ఎ) తెలిపింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో రమల్లా, హెబ్రాన్, బెత్లెహామ్‌ల్లోని పలు గ్రామాలు, పట్టణాల్లో అనేక ఇళ్లపై ఈ దాడులు జరిగాయి.

పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేయాలి

గాజాలో పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేయాలని హమాస్ కోరింది. మానవతా ఒప్పందంలోని అన్ని అంశాలను అమలుచేసేందుకు, ఒప్పందంలోని మిగిలిన నిబంధనలను కూడా పాటించేందుకు ఇజ్రాయిల్ కట్టుబడి వుండాలని హమాస్ ప్రతినిధి అబ్దుల్ లతీఫ్ అల్ ఖానూ కోరారు.

మొదటి దశ ప్రారంభమై ఇప్పటికి 33 రోజులు గడిచినా, ఒప్పందంలోని అన్ని అంశాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గాజాలో పరిస్థితి అత్యంత దారుణంగా వుందని, దాడుల భయంతో ఇతర ప్రాంతాలకు పారిపోయి తిరిగి స్వస్థలాలకు వచ్చిన వారికి ఇక్కడ రాళ్లు రప్పలు తప్ప మరేమీ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తమ ప్రజలకు తక్షణమే ఆవాసాలు, ఇతర సహాయ సరఫరాలు అందజేయాలని, వాటికి సంబంధించి ప్రోటోకాల్‌ను పూర్తిగా అమలు పరచాలని ఆయన కోరారు. మధ్యవర్తులు దీనికోసం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని అన్నారు. అప్పుడే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసినట్లవుతుందన్నారు.

ఒక్కసారే విడుదల చేస్తాం

బందీలు, ఖైదీల పరస్పర విడుదలకు సంబంధించిన అన్ని దశలను ఒకేసారి పూర్తి చేయడానికి తాము సిద్ధంగా వున్నామని హమాస్ ప్రతినిధి హాజీమ్ ఖాసిమ్ తెలిపారు. ఇందుకు గానూ కాల్పుల విరమణను స్థిరంగా అమలు చేస్తూ, గాజా నుండి పూర్తిగా బలగాలన్నీ వైదొలగాలని అది జరిగిన పక్షంలో బందీలందరినీ ఒకేసారి విడుదల చేస్తామని, వారు కూడా ఖైదీలందరినీ విడుదల చేయాలని కోరారు.

భారత్ నుంచి కూడా వలసదారులను పంపేయాలి

- ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు

ఛత్రపతి శంభాజీనగర్ : దేశ ఎన్నికల ప్రక్రియలో సరైన పత్రాలు లేని వలసదారులు జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల స్వదేశానికి పంపించిన వారి గురించి ప్రస్తావిస్తూ, మన దేశంలో ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో ప్రతి ఒక్క భారతీయుడు అడగాలని అన్నారు. ఇక్కడ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 65వ వార్షికోత్సవంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మరాఠీ మాట్లాడలేదని కండక్టర్‌పై మూకుమ్మడి దాడి

బెంగళూరు : ఆర్‌టిసి బస్సులో కండక్టర్ మరాఠీ భాష మాట్లాడలేదని మూకుమ్మడి దాడికి పాల్పడిన ఘటన కర్ణాటకలోని బెళగావి పట్టణంలో జరిగింది. కర్ణాటక రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌కు చెందిన బస్సు బెళగావి మీదుగా వెళ్తుండగా కండక్టర్ మహదేవ్ హుక్కెరికి, ప్రయాణికులకు మధ్య గొడవ జరిగింది. ఓ మహిళ తన భర్తకు కూడా ఫ్రీ టికెట్ అడగడంతో.. కండక్టర్ మహిళలకు మాత్రమే ఫ్రీ టికెట్ అని, పురుషులకు కాదని చెప్పారు. దీంతో ఆ భార్యాభర్తలిద్దరూ మరాఠీలో మాట్లాడాలంటూ గొడవకు దిగారు. కండక్టర్ తనకు మరాఠీ రాదని, మీరే కన్నడలో మాట్లాడాలని చెప్పాడు. దీంతో ఆ దంపతులు, బస్సులో ఉన్న మరో ఐదారుగురు మరాఠీలు కండక్టర్‌పై దాడి చేశారు. ఫోన్ ద్వారా ముందు స్టాప్‌కు మరో 50 మందిని పిలిపించి మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. గాయపడిన కండక్టర్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



పనామా పోర్టుల నిర్వహణకు రాయితీలా!

- హాంకాంగ్ సంస్థపై పిటిషన్ విచారణకు కోర్టు ఆమోదం

పనామా సిటీ : పనామా కాలువకు ఇరువైపులా గల ఓడరేవుల నిర్వహించేందుకు హాంకాంగ్‌కి చెందిన సంస్థకు రాయితీలు ఇవ్వడాన్ని సమీక్షించేందుకు పనామా కోర్టు అంగీకరించింది. ఈ కాలువపై చైనా ప్రాబల్యం పెరుగుతోందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాంకాంగ్ శతకోటీశ్వరుడు లీ కా షింగ్‌కి చెందిన సికె హచిషన్ హోల్డింగ్స్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒక న్యాయవాది వేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించిందని పనామా న్యాయ విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. పనామా ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో 1997 నుండి ఈ కాలువకు చెందిన ఐదు ఓడరేవుల్లో రెండింటిని ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఈ రాయితీలు ఆటోమేటిక్‌గా 2047వరకు కొనసాగుతున్న విషయాన్ని కోర్టు పరిశీలించనుంది. దీంతో ఈ నెలలోనే ఇదే అంశంపై రెండు కేసులు నమోదయ్యాయి.

మహారాష్ట్రలో రేకుల షెడ్డు కూలి ఐదుగురు మృతి

జల్నా : మహారాష్ట్రలో జాల్నా జిల్లాలో నిర్మాణ స్థలంలో ఉన్న రేకుల షెడ్డు కూలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంఘటన నివారం తెల్లవారుజామున జరిగింది. ఈ ఘటనకు సంబంధించి జిల్నా జిల్లా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో.. ఆ జిల్లాలోని జఫ్రాబాద్ తాలూకాలోని చందోల్ రోడ్డులో ఈ ఘటన జరిగింది. ఈ రోడ్డులో ఓ నిర్మాణ స్థలంలో రేకుల షెడ్డు ఉంది. ఆ షెడ్డులో ఆరుగురు నిద్రపోతున్నారు. ఆ సమయంలో ఇసుక లోడ్‌ను టిప్పర్ డ్రైవర్ దించుతున్న సమయంలో.. ఆ షెడ్డుని బలంగా గుద్దడంతో అది కూలిపోయింది. షెడ్డు కూలిపోవడాన్ని దగ్గరలోని గోశాలలో ఉన్న ఓ మహిళ చూసింది. వెంటనే.. ఆమె రైతులకు చెప్పడంతో.. వారు ఘటనా స్థలానికి చేరుకుని కూలిన రేకులను తొలగించారు. వీరిలో 12 ఏళ్ల అమ్మాయిని రక్షించారు. మిగిలిన ఐదుగురు నిద్రలోనే కన్నుమూశారని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో చనిపోయిన వారిలో గణేష్ కాశీనాథ్ ధన్వాయి (50), అతని కుమారుడు భూషణ్ ధన్వాయి (17)లుగా పోలీసులు గుర్తించారు. వీరు తహసీల్‌లోని గోలేగావ్‌లో నివశిస్తున్నారు. బుల్దానాలోని దాహిద్‌కు చెందిన రాజేంద్ర దగ్డుబా వాఘ్ (40), భోకర్దన్ తహసీల్ పద్మావతి గ్రామానికి చెందిన సునీల్ సమాధాన్ సప్కల్ (20), జామ్నేర్‌లోని తొండాపూర్‌కు చెందిన సుప్డ అహోర్ (38)లుగా మృతదేహాలను పోలీసులు గుర్తించారు. వీరందరూ దగ్గర బంధువులు. కాంట్రాక్టర్ రవీంద్ర ఆనంద్ రాత్రివేళల్లో ఇసుక అక్రమంగా తవ్విస్తున్నాడని, ఆ ట్రక్కు నడిపిన డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడని రైతులు తెలిపారు. మృతదేహాలను అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించారు. గ్రామస్తులు పోస్టుమార్టం నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో జఫ్రాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోలీసు బృందాన్ని ఘటనా స్థలానికి రప్పించి.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అక్రమ మైనింగ్‌పై రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారులకు సమాచారమిచ్చారు.

అటవీ నిధులతో ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలు

- ఉత్తరాఖండ్ అధికారుల నిర్వాకంపై కాగ్ అక్షింతలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో అటవీ సంరక్షణ కోసం ఉద్దేశించిన నిధులతో అధికారులు ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారని కాగ్ నిర్ధారించింది. అటవీ, ఆరోగ్య శాఖలు, కార్మికుల సంక్షేమ బోర్డు కలిసి ప్రజాధనాన్ని ఎలాంటి ప్రణాళికలు, అనుమతులు లేకుండా ఖర్చు పెట్టాయని 2021-22 సంవత్సరానికి సంబంధించిన కాగ్ నివేదిక ఎత్తిచూపింది. ఉత్తరాఖండ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నివేదికను శుక్రవారం సభ ముందుంచారు. సుమారు రూ.14 కోట్ల నిధులను అధికారులు ఇతర కార్యకలాపాల కోసం దారిమళ్లించారని కాగ్ గుర్తించింది. ఈ నిధులతో ఐఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిడ్జిలు, కూలర్ల కొనుగోలుతోపాటు భవనాల ఆధునీకరణకు, కోర్టు కేసులకు ఖర్చు చేశారు. అటవీ భూముల బదిలీ నిబంధనలను బేఖాతరు చేశారని, రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి సరఫరా లైన్లు, రైల్వేలు వంటి అటవీయేతర పనులు చేపట్టడానికి కేంద్రం అనుమతి ఇచ్చిందని కాగ్ తేల్చింది.


డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనుమతి లేకుండానే 2014-2022 మధ్య కాలంలో 52 పనులు చేపట్టారని చెప్పింది. అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలను సరిగా సంరక్షించలేకపోయారని, దీంతో అవి చాలా వరకూ చనిపోయాయని వివరించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాలం చెల్లిన మందులు పంపిణీ చేశారని కాగ్ గుర్తించింది. కనీసం మూడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాలం చెల్లిన 34 మందులు నిల్వ ఉన్నాయని, వీటిలో కొన్నింటికి రెండు సంవత్సరాల క్రితమే కాలం చెల్లిందని తెలిపింది.

బిజెపి ఎంపిపై పరువు నష్టం కేసులో విచారణ వాయిదా

న్యూఢిల్లీ : బిజెపి ఎంపిపై ఆప్ నేత సత్యేందర్ జైన్ దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం కేసు విచారణను స్థానిక రోహిణీ కోర్టు వాయిదా వేసింది. సంబంధిత జడ్జి నైనా గుప్తా శనివారం సెలవు తీసుకోవడంతో విచారణ వాయిదా పడిందని, ఈ కేసును జులై 14న విచారణకు జాబితా చేశామని కోర్టు తెలిపింది. సత్యేందర్ జైన్ నివాసం నుండి రూ.3 కోట్ల నగదు, 1.8 కిలోల బంగారం, 133 బంగారు నాణేలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్వాధీనం చేసుకుందని 2023 అక్టోబర్‌లో ఒక టివి చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో బిజెపి నేత బన్సూరీ స్వరాజ్ ఆరోపించారు. తనను అవమానపరిచేందుకు, రాజకీయ లబ్ధి పొందేందుకు బన్సూరీ ఈ వ్యాఖ్యలు చేశారని జైన్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తమ స్పందన తెలపాల్సిందిగా బిజెపి ఎంపి బన్సూరీ స్వరాజ్, ఇతర ప్రతివాదులకు గతేడాది అక్టోబర్‌లో కోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

స్వదేశానికి నేపాల్ విద్యార్థులు

- ఒడిశా అధికారులతో చర్చించామన్న నేపాల్ మంత్రి



ఖాట్మండు : ఒడిశాలోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కెఐఐటి) విశ్వవిద్యాలయం అధికారులు తమ పట్ల అమానవీయంగా వ్యవహరించారంటూ నేపాల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీలో నేపాల్ విద్యార్థిని ఈ నెల 16న ఆత్మహత్య చేసుకోవడంతో ఆ దేశానికి చెందిన విద్యార్థులు ఆందోళన చేశారు. దీంతో హాస్టల్ ఖాళీ చేయాలంటూ వర్సిటీ అధికారులు వారిని ఆదేశించారు. దీంతో, 159 మంది విద్యార్థులు నేపాల్ వెళ్లారు. ఈ వర్సిటీలో సుమారు వెయ్యి మంది నేపాల్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ అంశంపై నేపాల్ విదేశాంగమంత్రి అర్జురాణా దేవ్‌బా మాట్లాడుతూ ఈ అంశంపై దౌత్య పద్ధతుల్లో మాట్లాడి, పరిష్కరించామని చెప్పారు. నేపాల్ విద్యార్థిని మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరుపుతామని, నేపాల్ విద్యార్థులు తిరిగి హాస్టళ్లలో చేరి చదువుకునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని ఒడిశా మంత్రి సురజ్ హామీ ఇచ్చారని చెప్పారు.

రైతులకు ధరాఘాతం

- కిలో వంగ రూ.5, టమాటో రూ.3

ప్రజాశక్తి-రామభద్రపురం (విజయనగరం జిల్లా)

అతివృష్టి, అనావృష్టి వంటి అన్ని వాతావరణ పరిస్థితులూ తట్టుకొని కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు ధరాఘాతం దెబ్బకు విలవిలలాడుతున్నారు. గత కొద్ది రోజులుగా వంగ, టమాటో ధర పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన ఆరికతోట, బూసాయవలస, నాయుడువలస, కోట శిర్లాం, మామిడివలస, కొండ కెంగువ, తారాపురం, మిర్తివలస తదితర గ్రామాల్లో కూరగాయలు ఎక్కువగా సాగవుతున్నాయి. ఇక్కడి రైతులు వంగ, టమాటో, బీర, మునగ, దొండ, బెండ, కాకర, చిక్కుడు, ముల్లంగి, క్యాబేజీ వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఆ గ్రామాలతో పాటు బాడంగి, దత్తిరాజేరు మండలాల నుంచి కూడా కూరగాయలను రైతులు రామభద్రపురం మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దళారులు అతి తక్కువ ధర నిర్ణయించి కూరగాయల రైతుల శ్రమను దోచుకుంటున్నారు. జిల్లాలో పేరొందిన రామభద్రపురం కూరగాయల మార్కెట్లో శనివారం టమాటో కేట్ (30 కిలోలు) కేవలం రూ.90 నుంచి 130 పలికింది. కేట్ వంగ రూ.150 వరకు ధర మాత్రమే వచ్చింది. బయటి మార్కెట్‌లో వినియోగదారులకు కిలో టమోటో రూ.12 నుంచి 20, వంగ రూ.20 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. ఎకరా సాగు కోసం టమాటోకు సుమారు రూ.30 వేలు, వంగకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. వీటిని విడతల వారీగా ఏరి మార్కెట్‌కు తరలించడానికి సుమారు రూ.5 వేల వరకు ఖర్చులు అవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్ ధరతో పోలిస్తే, కనీసం కూలీ ఖర్చులు కూడా రావని రైతులు దిగాలు చెందుతున్నారు.

వివాహాల సీజన్ అయినా..

ప్రస్తుతం శుభ ముహూర్తాల సీజన్ నడుస్తున్నా, కూరగాయల ధరలు అమాంతం తగ్గడంతో రైతు దిగాలు చెందుతున్నాడు. వేలకు వేలు మదుపులు పెట్టి, నారు నుంచి కాయ వరకు అనేక సంరక్షణ పద్ధతుల ద్వారా పెంచి పోషించిన పంటలు తమ ఇంట రాబడి సిరులు కురిపించేలా చేస్తాయని ఆశించారు. కానీ, గిట్టుబాటు కాక, పెట్టిన పెట్టుబడులు కూడా దక్కని స్థితిలో అడకత్తెరలో పోక చెక్కలా నలిగే పరిస్థితి దాపురించిందని రైతులు ఉసూరుమంటున్నారు. ప్రభుత్వం కూరగాయ పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలని, శీతల గిడ్డంగి సదుపాయాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

టమాటో ధర లేక నష్టాలు

ఈ ఏడాది సుమారు 75 సెంట్ల పొలంలో టమాటో సాగు చేశాను. నారు నుంచి కాయ వచ్చే వరకు వివిధ దఫాలుగా సుమారు రూ.25 వేలు ఖర్చయింది. మొదటి పంట దిగుబడి తక్కువగా పక్వానికి వచ్చినప్పుడు ధర కొంత మెరుగ్గా ఉంది. చివరి కోతలో దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ ధర పతనం కావడంతో పెట్టుబడి కూడా రావడం లేదు.

– కోట వెంకటరావు, టమాటో రైతు, ఆరికతోట

వంగ ధర.. బెంగ తెప్పిస్తోంది

ఈ ఏడాది విరగ కాసిన వంగ పంట చూసి పాత అప్పులు తీరుతాయని అనుకున్నాం. కానీ ఇప్పుడు అమాంతం ధర పడిపోవడంతో పాత అప్పు తీర్చడానికి కొత్తగా అప్పు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. పంటలు దాచుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

– మామిడి శివయ్య, వంగ రైతు, రామభద్రపురం

కేసుల దర్యాప్తులో నైపుణ్యమే కీలకం

- విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

గంజాయి అక్రమ రవాణా, ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో పటిష్టంగా దర్యాప్తు చేపట్టి శిక్షలు శాతం పెరిగేలా దర్యాప్తు చేయాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి పోలీసు అధికారులకు దిశ నిర్దేశాలు చేశారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో చట్టపరమైన నిబంధనలు, పాటించాల్సిన నియమాలు, నైపుణ్యంపై ఎస్‌పి కె.వి.మహేశ్వరరావు అధ్యక్షతన శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ అధికారి ఎ.రంగథామ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యతా అంశాల్లో గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ముఖ్యమైన అంశమని అన్నారు. ఆ దిశగా గంజాయి రవాణా, వ్యాపారస్తులు మూలాలు కనిపెట్టి కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నేరస్తులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తును పూర్తిస్థాయిలో చేయాలన్నారు. అలాగే నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ ఎంతో కష్టపడి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న గంజాయిని పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. అనంతరం రంగథామ్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ, పార్వతీపురం మన్యం ఎఎస్‌పి అంకిత సురాన, డిఎస్‌పిలు వి.వి.అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఎం.రాంబాబు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ బ్రౌన్ తొలగింపు

- కెయిన్‌ను నియమిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్ : పెంటగాన్‌లోని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ చార్లెస్ క్యూ బ్రౌన్‌ను అమెరికా అధ్యక్షులు ట్రంప్ శుక్రవారం తొలగించారు. ఆయన స్థానంలో వైమానిక దళం లెఫ్టినెంట్ జనరల్ జాన్ డాన్ "రజిన్" కెయిన్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్‌తో సహా దేశానికి 40 సంవత్సరాలకు పైగా సేవలందించినందుకు చార్లెస్ క్యూ బ్రౌన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. ఆయన గొప్ప వ్యక్తి, అద్భుతమైన నేత అని, ఆయనకు, ఆయన కుటుంబానికి గొప్ప భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వైమానిక దళం లెఫ్టినెంట్ జనరల్ డాన్ రజిన్ కెయిన్‌ను జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్‌గా తదుపరి చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించడం గౌరవంగా ఉందని మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. జనరల్ కెయిన్ ఒక నిష్ణాతుడైన పైలెట్, జాతీయభద్రతా నిపుణుడు, యుద్ధయోధుడు అని పేర్కొన్నారు.

అపోలో ఆస్పత్రిలో పవన్‌కు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు ఆయనకు స్కానింగ్, తత్సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఈ రిపోర్టులను పరిశీలించిన పలు సూచనలు చేశారు. మరికొన్ని వైద్య పరీక్షలు అవసరం ఉన్నందున ఈ నెలాఖరులో లేదా మార్చి మొదటి వారంలో వాటిని ఆయన చేయించుకోనున్నట్టు సమాచారం..పవన్ కల్యాణ్ కొంతకాలంగా సయాటికాతో బాధపడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, ఈ నెల 24 నుంచి ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.

విరిగిపోయిన సీటు ఇచ్చారు

- ఎయిర్ ఇండియాపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ ఆగ్రహం
- విమానయాన సంస్థ క్షమాపణలు

న్యూఢిల్లీ : దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా సేవలపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సందర్భంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించినట్టు చెప్పారు. ఈ మేరకు ప్రయాణికులను ఆ సంస్థ మోసం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను భోపాల్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్ ఇండియా ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నా. నాకు సీట్ నంబర్ 8సీ కేటాయించారు. సీటు వద్దకు వెళ్లి చూడగా అది విరిగిపోయి ఉంది. ఇది చూసి నేను ఆశ్చర్యపోయా. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా.. సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించినట్టు చెప్పింది. ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. అదొక్క సీటే కాదు.. విమానంలోని మరికొన్ని సీట్లు కూడా ఇదే విధంగా ఉన్నట్టు సిబ్బంది చెప్పారు. దీనివల్ల చాలా అసౌకర్యం కలిగింది. నా పరిస్థితి చూసి తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోవాలంటూ ఆఫర్ చేశారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక నేను అదే విరిగిపోయిన సీట్‌లో దాదాపు గంటన్నర పాటు ప్రయాణించాను. ఇలాంటి చర్యలు ప్రయాణికుల్ని మోసం చేయడం కిందకే వస్తాయి. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నా.. అది అపోహేనని అర్థమయ్యింది" అంటూ కేంద్ర మంత్రి తనకు ఎదురైన అనుభవాన్ని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కేంద్ర మంత్రి ట్వీట్‌పై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. మంత్రికి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది.

రైతు నేతలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు నేతలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. శనివారం చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో జరిగిన ఈ చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరపున కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, వినియోగదారుల వ్యవహారాల, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ ఖుడియన్, ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి లాల్ చంద్ కటారుచక్ సమావేశంలో పాల్గొన్నారు. రైతు నేత జగ్జిత్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పాంధర్ పాల్గొన్నారు. పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కోసం చట్టపరమైన హామీతో పాటు రైతులకు రుణ మాఫీ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ ఛార్జీల పెంపుదల ఉండకూడదని, పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని, 2021 లఖింపూర్ ఖేరీ హింస బాధితులకు న్యాయం చేయాలని రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని పునరుద్ధరించడం, రైతు ఉద్యమంలో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

కష్టాల్లో నేతన్న

- పెరుగుతున్న ముడి సరుకు ధర
- గిట్టుబాటు ధర గగనం
- పాలక వర్గాలు లేక కుదేలు
- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాలు మారుతున్నా చేనేత కార్మికుల స్థితిగతులు మారడం లేదు. పాలకుల విధానాల వల్ల ఈ రంగం నానాటికీ తీసికట్టుగా మారింది. ముడి సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో గిట్టుబాటు ధర గగనంగా మారుతోంది. గత ప్రభుత్వం మాదిరిగానే టిడిపి కూటమి ప్రభుత్వంలోనూ ఆప్కోకు పాలక వర్గం ఏర్పాటు కాలేదు. స్థానికంగా ఉన్న సహకార సంఘాలకు అధ్యక్షులు ఉంటారు. వీరు జిల్లాకు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఆప్కోకు ఛైర్మన్ వస్తారు. అయితే ఇంత వరకూ పాలక వర్గం ఊసే ప్రభుత్వం ఎత్తక పోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. సరైన పర్యవేక్షణ లేక, దీనిపై అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయిలో అవగాహన లేక చేనేత రంగం చితికిపోతోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయ్యారు. మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి పొందుతున్న వారు వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలు ఉన్నాయి. యు.కొత్తపల్లి మండలం అమినాబాధ, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, కడియం మండలం దుళ్ల, వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

పెరుగుతున్న ముడి సరుకు ధర

కరోనా తర్వాత నుంచి చేనేత రంగం మరింత పతనానికి గురైంది. రెండేళ్ల కరోనా దెబ్బతో చేనేత కార్మికులు అల్లాడిపోయారు. నాడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ రంగాన్ని గట్టెక్కించలేకపోయింది. ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు నేసిన చీరలను కొనేవారు లేక కార్మికులు అష్టకష్టాలు పడ్డారు. ఆ ప్రభావం నేటికీ వీరిని వెంటాడుతూనే ఉంది. మరోవైపు చేనేతలకు అండగా నిలిచే మాస్టర్ వీవర్స్ బతుకులు కూడా దుర్భరంగా మారిపోయాయి. ముడిసరకు ధరలకు తోడు పెరుగుతున్న విద్యుత్తు ఛార్జీల భారం కూడా నేతన్నల నడ్డి విరుస్తోంది.

ఈ నేపథ్యంలోనే మగ్గాలనే నమ్ముకుని బతుకులు వెళ్లదీస్తున్న వేల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కార్మికులకు ప్రోత్సాహం లేకపోవడంతో సమస్యలు ఇంకా పెరుగుతున్నాయి. గతంలో కిలో పట్టు రూ.2,800 ఉండేది. ఆ తర్వాత రూ.5 వేలకు పెరగగా ప్రస్తుతం రూ.8 వేలు అయింది. జరీ రూ.325 ఉండేది. ఇప్పుడు రూ.500 నుంచి 600, రంగులు 150-170 ఉండేవి. ఇప్పుడు రూ.300 నుంచి 500కి పెరిగాయి.

నేతన్న నేస్తం కోసం ఎదురు చూపులు

గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించేవి. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరిసారిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లలా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా నేతన్న నేస్తం ఇవ్వడం లేదు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత రంగం కుదేలు అవుతున్న నేపథ్యంలో చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు.

దేశంలో నయాఫాసిజం ధోరణులు

- లౌకిక శక్తుల విశాల ఐక్యత చాలా అవసరం
- పార్టీ స్వతంత్ర బలం.. వామపక్షాల ఐక్యత బలోపేతం
- సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలో ప్రకాశ్ కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నయా ఫాసిజం లక్షణాలు, ధోరణులు ఏర్పడుతున్నాయనీ, మనం అప్రమత్తంగా ఉండి ఇప్పుడే దాన్ని నిలువరించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ స్పష్టం చేశారు. దేశంలో లౌకిక శక్తుల విశాల ఐక్యత చాలా అవసరమని, అలాగే సిపిఎం స్వతంత్ర బలాన్ని పెంచడం, వామపక్షాల ఐక్యతను పెంపొందించడం కీలకమని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ భావజాలానికి వ్యతిరేకంగా పోరాటానికి సిపిఎం, వామపక్షాల, స్వతంత్ర శక్తులను బలోపేతం చేయడం అవసరమన్నారు. హుగ్లీ దంకునిలోని బుద్ధదేవ్ భట్టాచార్య నగర్‌లోని సీతారాం ఏచూరి వేదికలో సిపిఎం 27వ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభ శనివారం ప్రారంభమైంది. సిపిఎం సీనియర్ నేత బిమన్‌బసు ఎర్ర జెండాను ఎగురవేశారు. ఆ తరువాత ప్రకాశ్‌కరత్, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, ఇతర నాయకులు, ప్రతినిధులు అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు.



సిపిఎం పశ్చిమబెంగాల్ రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్

ప్రారంభసభలో ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ మళ్లీ బాధ్యతలు స్వీకరించిన తరువాత, అంతర్జాతీయ సంబంధాలలో అల్లకల్లోల పరిస్థితిని సృష్టించే నిర్ణయాలను ప్రకటించడం ప్రారంభించారని అన్నారు. ఇది ప్రపంచంలో కొత్త ఉద్రిక్తతలను సృష్టిస్తోందని అన్నారు. గాజాను ఆక్రమించడం, శ్వేతజాతీయులకు మద్దతుగా దక్షిణాఫ్రికాకు అన్ని సహాయాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం సామ్రాజ్యవాదం, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వైరుధ్యాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. మరోవైపు చైనాపై సుంకాలు, వాణిజ్య యుద్ధాలతో బెదిరింపులు సోషలిజంతో వైరుధ్యాన్ని స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. ఇది ప్రపంచ రాజకీయాల్లో 'ట్రంపిజం' ప్రభావమని ఎద్దేవా చేశారు. యూరప్‌లోని వివిధ దేశాల్లో నయా ఫాసిజం పెరుగుతోందని, కొన్నిచోట్ల 1930ల నాటి ఫాసిజం వారసులుగా, మరి కొన్నిచోట్ల వేరే రూపంలో పెరుగుతోందని ఆయన అన్నారు. మరోవైపు కొలంబియా, ఉరుగ్వే, మెక్సికో, మన పొరుగు దేశమైన శ్రీలంకలో వామపక్షవాదులు ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని తెలిపారు. బంగ్లాదేశ్‌లో సామ్రాజ్యవాద మద్దతుతో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ప్రజా నిరసనలను ఉపయోగించుకుని మితవాద ఇస్లామిక్ ఛాందసవాదులు అధికారాన్ని చేజిక్కించుకున్నారని, లౌకిక ప్రజాస్వామ్య భావనపై దాడి చేస్తున్నారని తెలిపారు. బంగ్లాదేశ్ సంఘటన చుట్టూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రచారం బంగ్లాదేశ్‌లోని మైనారిటీ హిందువులను కాపాడటానికి కాదని, భారతదేశంలోని మైనారిటీ ముస్లిములపై దాడి చేయడానికే అని కరత్ అన్నారు.


దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ మతతత్వ హిందూత్వ రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నిస్తున్నారని ప్రకాశ్‌కరత్ విమర్శించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కూడా నయాఉదారవాద విధానాలను అమలు చేయడంలో చురుగ్గా ముందుకు సాగాలని కోరుకుంటున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. అమెరికాలో ట్రంప్ ఎలన్ మస్క్‌ను ప్రభుత్వ అధికారంలో భాగస్వామిగా చేసినట్లే, మోడీ కూడా తన సన్నిహిత పారిశ్రామికవేత్తల దోపిడీకి బహిరంగంగా మద్దతు నిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా నిరంకుశత్వంగా వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్య సంస్థలను స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. ప్రత్యర్థులను జైలులో పెడుతున్నారని, డబ్బు వినియోగం, మీడియాను, ఎన్నికల సంఘాన్ని నియంత్రించడంతో ఎన్నికలలో గెలుస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటరీ వ్యవస్థను పేపర్లలో సజీవంగా ఉంచుతూ నయా ఫాసిస్టులు అధికారాన్ని చేజిక్కించుకున్న విధానం ఇదేనని అన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్ట్, వామపక్ష ఉద్యమాలకు అద్భుతమైన చరిత్ర ఉందని, అది దేశవ్యాప్తంగా ఎల్లప్పుడూ ముఖ్యమైన పాత్ర పోషించిందని కరత్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, నేరపూరిత పాలన నడుస్తోందని పేర్కొన్నారు. వామపక్ష కార్యకర్తలు హింసాత్మక దాడులను ఎదుర్కొంటూ రాష్ట్రంలో బిజెపి, టిఎంసిలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గత మూడేళ్లలో రాష్ట్రంలో వర్గ, ప్రజా పోరాటాలను నిర్వహించడంలో సిపిఎం పురోగతి సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం, పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, బృందా కరత్, సూర్యకాంత్‌మిశ్రా, ఎంఎ బేబీ, తపన్ సేన్, అశోక్ ధావలే, నీలోత్పల్ బసు, రామచంద్ర డోమ్, సీనియర్ నేత హన్నన్ మొల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా శక్తికాంత దాస్

- ఆర్‌బిఐ మాజీ గవర్నర్‌కు మరో కీలక పదవి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ శక్తికాంత దాస్.. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ కేబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. ప్రధాన మంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పికె మిశ్రా 2019 సెప్టెంబర్ 11 నుంచి ప్రధాన మంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్‌బిఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ గతేడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్‌బిఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఉర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్‌బిఐ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంత దాస్ ఉన్నారు. 2017 జులై ఒకటి నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జిఎస్‌టిలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్‌బిఐ గవర్నర్‌గా ఆయన పదవీకాలం ముగియాల్సి ఉండగా, మరో మూడేళ్లు పొడిగించారు.

రాజస్థాన్ అసెంబ్లీలో గందరగోళం

- అసెంబ్లీలోనే ఎమ్మెల్యేల నిద్ర

జైపూర్ : రాజస్థాన్ అసెంబ్లీలో శుక్రవారం గందరగోళం నెలకొంది. ఆ రాష్ట్ర మంత్రి అవినాశ్ గెహ్లాట్ అసెంబ్లీలో గురువారం మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పేరుతో గత ప్రభుత్వం వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్లను ప్రారంభించిందని పేర్కొన్నారు. అలా చెప్పే సమయంలో.. దాదీ (బామ్మ) ఇందిరాగాంధీ అని మంత్రి వ్యాఖ్యానించడంతో, ఆ వ్యాఖ్యలను మంత్రి ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఆందోళన చేసిన ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేశారు. అనంతరం సభను సోమవారం ఉదయం 11 వరకు వాయిదా వేశారు. సస్పెండ్ చేసిన అనంతరం సభలోనే ధర్నా చేస్తున్నట్లు ప్రతిపక్షనేత టికారం జుల్లీ చెప్పారు. ఆ ఎమ్మెల్యేలందరూ శుక్రవారం రాత్రంతా అసెంబ్లీలోనే నిద్రపోయారు. మంత్రి అవినాశ్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షనేత టికారం జుల్లి డిమాండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో గోవింద్ సింగ్ దోస్తారా, రాంకేశ్ మీనా, అమిన్ కాగ్జి, జాకిర్ హుస్సేన్, హకమ్ అలీ, సంజయ్ కుమార్‌లు ఉన్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

- 24 నుంచి 27 వరకు నిర్వహణ
- ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల ఎన్నిక

న్యూఢిల్లీ : ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత నూతన అసెంబ్లీ తొలిసారి సమావేశం కాబోతున్నది. ఈనెల 24న అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు మొదలుకానున్నాయి. సమావేశాలు మొదలవగానే ముందుగా ప్రొటెం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ఆ తర్వాత ఉదయం 11 గంటల నుంచి కొత్త ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారాలు జరుగుతాయి. ఆ తర్వాత లంచ్ విరామం ఉంటుంది. లంచ్ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ మొదలవగానే స్పీకర్‌ను ఎన్నుకుంటారు.

ఇక సమావేశాల రెండో రోజైన ఫిబ్రవరి 25న అసెంబ్లీలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వికె సక్సేనా ప్రసంగిస్తారు. ఎల్‌జి ప్రసంగం ముగియగానే ప్రభుత్వం కాగ్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడుతుంది. మూడో రోజైన ఫిబ్రవరి 27న ఉదయం నుంచి ఎల్జీ ప్రసంగంపై చర్చ జరుగుతుంది. చర్చ ముగిసిన తర్వాత డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే.

ట్రంప్ వ్యాఖ్యల చిచ్చు

- భారత్‌కు అమెరికా నిధులపై బిజెపి, కాంగ్రెస్ మాటల యుద్ధం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు భారత్‌లో రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. కేంద్రంలో ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్నది. భారత్‌కు 2022లో అమెరికా సుమారు 21 మిలియన్ డాలర్ల యుఎస్ఎయిడ్ ఫండ్‌ను మళ్లించినట్టు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల ఓ మీడియా సమావేశంలో తెలిపిన విషయం విదితమే.

ఇప్పుడు ఆయన వ్యాఖ్యలపైనే భారత రాజకీయాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాకుండా కాంగ్రెస్ చేసిన ప్రయత్నంలో భాగమే యుఎస్ఎయిడ్ ఫండ్ అని బిజెపి ఆరోపిస్తుండగా.. తమను ఓడించేందుకు కమలం పార్టీ ఆ డబ్బును తీసుకున్నట్టు హస్తం పార్టీ అంటున్నది. భారత్‌లోని ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచటానికి కేటాయించబడినట్టుగా చెప్తున్న ఈ 21 మిలియన్ల డాలర్ల నిధుల్ని బంగ్లాదేశ్‌కు తరలించారని, భారత్‌కు కాదని బిజెపి అంటున్నది. భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగించేందుకు ఆ నిధులు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎన్జీవోలకు దక్కినట్టు బిజెపి ఆరోపిస్తున్నది.

బిజెపి క్షమాపణలు చెప్పాలి : కాంగ్రెస్

బిజెపి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. బిజెపి అమెరికా నిధుల్ని వాడుకున్నదని వివరించింది. ఆ అంశం నుంచి దృష్టిని మరల్చేందుకే బిజెపి ఈ ఆరోపణలు చేస్తున్నదని తెలిపింది. 21 మిలియన్ డాలర్ల నిధుల గురించి ట్రంప్ ఇప్పటికే అనేకసార్లు మాట్లాడారు. భారత్ వంటి దేశానికి తరలించటంపై ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు కూడా. అదో కిక్‌బ్యాక్ స్కీమ్ అనీ, మన దగ్గరే సమస్యలుంటే.. ఇండియా ఎన్నికల గురించి ఎందుకు ఆ నిధుల్ని ఇస్తున్నారని ట్రంప్.. అమెరికాలో బైడెన్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించారు.

భారత్‌కు నిధులు వస్తే.. దోవల్, ఐబి, రా ఎక్కడ? : కాంగ్రెస్ నేత పవన్ ఖేరా

కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ విషయంలో బిజెపిని తప్పుబట్టారు. యుఎస్ఎయిడ్ బ్రాండ్ అంబాసిడర్‌గా స్మృతి ఇరానీ ఉన్నారనీ, ఆమె చేతిలో గ్యాస్ సిలిండర్‌తో నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారనీ, దీని వెనక యుఎస్ఎయిడ్ ఉన్నదా? అని ఖేరా ప్రశ్నించారు. 21 మిలియన్ డాలర్లు ఇండియాకు వస్తే, అప్పుడు అజిత్ దోవల్, ఐబి, రా ఎక్కడ ఉన్నాయని అన్నారు. ఈ విషయంలో ఏకపక్ష వాదనలు వినిపిస్తున్న బిజెపి.. కాంగ్రెస్‌పై దాడికి దిగుతున్నదని ఆరోపించారు.

ట్రంప్, మస్క్ మాటలను నమ్మొద్దు : బృందాకరత్



భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యుఎస్ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లను అందించిందంటూ అమెరికా అధ్యక్షులు ట్రంప్, ఎలన్ మస్క్‌లు చేసిన వ్యాఖ్యలను నమ్మలేమని, వాస్తవాలను దర్యాప్తు చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ఈ వ్యాఖ్యలను వినియోగిస్తున్నారని అన్నారు. మొదటి ప్రశ్న ఏమిటంటే.. ట్రంప్, ఎలాన్ మస్క్‌లను విశ్వసించలేమని, వాస్తవాలు, ఆధారాలతో సంబంధం లేకుండా వారు ప్రకటనలు చేస్తారని అన్నారు. మొదటి పాఠం వారిని విశ్వసించకూడదని, వాస్తవాలను దర్యాప్తు చేయాలని అన్నారు. రెండవది, భారత ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను ఖండించకుండా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. అటువంటి నగదు ఏదీ అందలేదని మాజీ ఎన్నికల కమిషనర్ ఖురేషీ చాలా స్పష్టంగా, కచ్చితంగా చెప్పారని, కానీ భారత ప్రభుత్వం ఆయనకు మద్దతు ఇవ్వలేదని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి విషసంస్థలు గత ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, అసలు ప్రపంచం ముందు భారత్‌ను ఎలా చూపించాలనుకుంటున్నాయని ప్రశ్నించారు. భారత దేశ ప్రతిష్ట గురించి మోడీ ప్రభుత్వం బాధపడటం లేదని అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ట్రంప్ వ్యాఖ్యలను వెంటనే ఖండించాలని స్పష్టం చేశారు.

కులాల ప్రాతిపదికన పనులు కేటాయించొద్దు

- జైళ్లలో కుల, మత వివక్ష చూపొద్దు
- హిమాచల్‌ప్రదేశ్ జైళ్ల నిబంధనల్లో సవరణలు తెచ్చిన ప్రభుత్వం

సిమ్లా : జైల్‌లో కులాల ప్రాతిపదికన పనుల కేటాయింపు పద్ధతిని నిర్మూలిస్తూ, సమానత్వానికి హామీ కల్పిస్తూ హిమాచల్ ప్రదేశ్ జైళ్ల మాన్యువల్-2021లో కుల ఆధారిత నిబంధనలన్నింటినీ హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సవరించింది. జైళ్లు, దిద్దుబాటు సంస్థల్లో కుల ప్రాతిపదిక వివక్షను నిషేధిస్తూ మాన్యువల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఒక పేరాగ్రాఫ్‌ను పొందుపరిచింది. 'కులాల ప్రాతిపదికన ఎలాంటి వివక్షకు తావు లేకుండా, ఖైదీలను వర్గీకరించకుండా కొత్తగా చేర్చిన ఈ నిబంధన(పేరా 5.66) హామీ కల్పిస్తోంది.' అని ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. "అలాగే కుల ప్రాతిపదికన జైళ్లలో వారికి పనుల కేటాయింపు కూడా వుండకూడదని పేరా 5.67 పేర్కొంటోందని ఆయన చెప్పారు. పాకీ పని, మురుగునీటి కాల్వలను, సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రం చేయడం వంటి పనుల్లో ఖైదీలను వాడుకోరాదని పేరా 5.68 పేర్కొంటోంది. మహిళా ఖైదీలు లేనపుడు ఇటువంటి పనులు చేయడానికి జీతం ఇచ్చి స్వీపర్లను అనుమతించాలని జైల్ మాన్యువల్‌లో 214 పేరాలో ఒక నిబంధన వుంది. ఇప్పుడు ఆ నిబంధనను పూర్తిగా తొలగించారు. ఇకపై జైలు రికార్డుల్లో కులం, కమ్యూనిటీ లేదా ఆమతపరమైన ప్రస్తావనలు వుండరాదని ఆ ప్రతినిధి చెప్పారు. హిమాచల్ ప్రదేశ్ జైళ్ల మాన్యువల్ రెండో సవరణ, 2025 ద్వారా ఈ సంస్కరణలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అలవాటుగా నేరాలు చేసేవారికి స్పష్టమైన నిర్వచనాన్ని కూడా ఈ మాన్యువల్‌లో అందించారు. రాష్ట్రంలో జైళ్ల కార్యకలాపాలు వివక్షారహితంగా వుండేందుకు సమానత్వానికి, న్యాయానికి హామీ కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని చెప్పారు.

ఏ భాష అవసరమో తమిళులకు తెలుసు

- దానిపై ఆటలొద్దు
- 'హిందీ' వివాదంపై కమల్ హాసన్ హెచ్చరిక



న్యూఢిల్లీ : ఏ భాష అవసరమో తమిళులకు తెలుసునని, వారితో ఆటలొద్దని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్(ఎంఎన్ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ అన్నారు. ఇది చాలా సున్నితమైన విషయమనీ, తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. హిందీ భాష విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ఎంఎన్ఎం పార్టీ స్థాపించి ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చెన్నైలోని పార్టీ ఆఫీస్‌లో కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'తమిళులు భాష కోసం ప్రాణాలర్పించారు. అందుకే ఇలాంటి వాటితో ఆటలొద్దు. తమకు ఏ భాష అవసరమో తమిళులకు తెలుసు. ముఖ్యంగా పిల్లలు.. ఏ భాష కావాలో ఎంచుకునే జ్ఞానం వారికి ఉంది" అని కమల్ హాసన్ అన్నారు.

గ్రూపు -2 పరీక్ష నేడే

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమైంది. అయితే, అనూహ్యంగా శనివారం సాయంత్రం ఆదివారం నాడే గ్రూపు-2 పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎపిపిఎస్‌సి ప్రకటించింది. ఈ మేరకు షెడ్యేల్‌ను కూడా విడుదల చేసింది. అనూహ్యంగా విడుదలైన ఈ ప్రకటనతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు భగ్గుమన్నారు. విశాఖపట్నంలో పెద్ద సంఖ్యలో రోడ్లమీదకు చేరుకుని రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. రాత్రి పదిగంటల వరకు ఈ ఆందోళన కొనసాగింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ నిరసనలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఆదివారం నాడు పరీక్ష కేంద్రాల వద్ద నిరసనలు తెలుపుతామని కొన్ని చోట్ల నిరుద్యోగులు ప్రకటించారు.

ఇదీ షెడ్యూల్....!

ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 నిర్వహిస్తామని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన పరీక్షకు 92,250 మంది పరీక్షకు హాజరు కానున్నారని, 175 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివిధ శాఖల్లోని 897 గ్రూప్-2 పోస్టులకు ఎపిపిఎస్‌సి 2023 నవంబర్ 7న నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించింది. నోటిఫికేషన్ రోస్టర్ పాయింట్లలో తప్పులు ఉన్నాయని, వీటిని సరిదిద్దాలని తొలి నుంచి అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఏం జరిగింది...?

రోస్టర్ పాయింట్లలో తప్పులున్న కారణంగా ప్రధాన పరీక్షను రద్దు చేయాలని అభ్యర్థులు కోర్టుకెళ్లారు. రోస్టర్‌లో తప్పులు జరిగిన్నట్లు ప్రభుత్వం కూడా అంగీకరించింది. అయితే, నిరుద్యోగులు కోరుతున్న విధంగా చర్యలు తీసుకోవడంలో నాన్చుడు వైఖరి అవలంభించింది. చివరకు పరీక్షను వాయిదా వేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎపిపిఎస్‌సికి లేఖ రాసినా ఫలితం కనిపించలేదు. పరీక్షను వాయిదా వేయాలని కోర్టు తీర్పు ఆదేశించలేదని కనుక ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్ష నిర్వహిస్తామని కమిషన్ సమాధానం చెప్పినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి స్పందన సైతం పరీక్షకు కొన్ని గంటల ముందే వచ్చింది. దానిని రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థులు తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారు. దీనికి భిన్నంగా సిఎం ఇంకొంచెం ముందుగా స్పందించిఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

. అభ్యర్థులకు ఉపశమనం కలిగించాలి : కెఎస్ లక్ష్మణరావు

రోస్టర్ పాయింట్లపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులకు రాష్ట్రప్రభుత్వం ఉపశమనం కలిగించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లలో తప్పులు ఉన్నాయని హైకోర్టు కూడా వెల్లడించిందని తెలిపారు. దీనిపై ఆందోళన చేస్తున్న అభ్యర్థులను పిలిపించి చర్చలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను లక్ష్మణరావు కోరారు. పరీక్షపై ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో చర్చించి అభ్యర్థులకు ఉపశమనం కలిగించాలన్నారు.

వాయిదా వేయండి: డివైఎఫ్ఐ

గందరగోళం మధ్య గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రోస్టర్ పాయింట్స్‌లో జరిగిన తప్పులను సరిదిద్ది ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాలని శాంతియుతంగా నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిపిఎస్‌సి, ప్రభుత్వం స్పందించి సరిచేయకుండా ముందుకెళ్లడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. విజయనగరం, విశాఖపట్నం, తదితర జిల్లాల్లో శాంతియుతంగా ఆందోళన చేసిన డివైఎఫ్ఐ నాయకులను, అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థుల ప్రచారం ఇలా..



(కృష్ణా - గుంటూరు జిల్లాల టిడిపి గ్రాడ్యుయేట్ నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫేస్‌బుక్‌వాల్‌పై శనివారం కనిపించిన పోస్టు)

విరిగిపోయిన సీటు ఇచ్చారు

- ఎయిర్ ఇండియాపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ ఆగ్రహం
- విమానయాన సంస్థ క్షమాపణలు

న్యూఢిల్లీ : దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా సేవలపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవలే భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించిన సందర్భంలో తనకు విరిగిపోయిన సీటు కేటాయించినట్టు చెప్పారు. ఈ మేరకు ప్రయాణికులను ఆ సంస్థ మోసం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను భోపాల్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్ ఇండియా ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నా. నాకు సీట్ నంబర్ 8సీ కేటాయించారు. సీటు వద్దకు వెళ్లి చూడగా అది విరిగిపోయి ఉంది. ఇది చూసి నేను ఆశ్చర్యపోయా. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా.. సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించినట్టు చెప్పింది. ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. అదొక్క సీటే కాదు.. విమానంలోని మరికొన్ని సీట్లు కూడా ఇదే విధంగా ఉన్నట్టు సిబ్బంది చెప్పారు. దీనివల్ల చాలా అసౌకర్యం కలిగింది. నా పరిస్థితి చూసి తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోవాలంటూ ఆఫర్ చేశారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక నేను అదే విరిగిపోయిన సీట్‌లో దాదాపు గంటన్నర పాటు ప్రయాణించాను. ఇలాంటి చర్యలు ప్రయాణికుల్ని మోసం చేయడం కిందకే వస్తాయి. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నా.. అది అపోహేనని అర్థమయ్యింది" అంటూ కేంద్ర మంత్రి తనకు ఎదురైన అనుభవాన్ని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కేంద్ర మంత్రి ట్వీట్‌పై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. మంత్రికి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు చెప్పింది.

జెన్‌కోను ప్రైవేటీకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరాంతానికి డిస్కామ్‌లు 6.92 లక్షల కోట్ల రూపాయల నష్టాల్లో ఉన్నాయి.

మంత్రుల కమిటీ ఏర్పాటు

విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విషయంలో పట్టుదలగాఉన్న నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్టాక్ ఎక్స్ఛేంజ్ జాబితాలో చేర్చే అంశంపై ఐదు రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులతో కలిసి కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రులతో పాటు రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా సభ్యులుగా ఉన్నారు. గొట్టిపాటి అధ్యక్షతన జనవరి 30వ తేదిన ఈ కమిటీ తొలిసారి వర్చువల్‌గా సమావేశమయింది.



అశాంతిని రెచ్చగొట్టేవారిని ఉపేక్షించం

- శ్రీలంక ప్రభుత్వ హెచ్చరిక

కొలంబో : దేశంలో హింసాకాండను రెచ్చగొట్టి, అశాంతిని సృష్టించాలనుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటామని శ్రీలంక ప్రభుత్వం వెల్లడించింది. దేశంలో ఇటీవల చోటు చేసుకున్న హత్యలు అత్యున్నత స్థాయిలోని క్రిమినల్ కేసుల్లో కొనసాగుతున్న దర్యాప్తులను దెబ్బతీసేందుకే జరుగుతున్నట్లు కనిపిస్తోందని శనివారం ప్రభుత్వం వ్యాఖ్యానించింది. 2019 ఈస్టర్ ఆదివారం ఆత్మాహుతి బాంబుదాడులతో సహా పలు కేసుల్లో ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ఈ వారంలో కోర్టు గదిలో జరిగిన కాల్పుల్లో అండర్ వరల్డ్ డాన్ ఒకరు మరణించారు. ఆ సంఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం పై వ్యాఖ్యలు చేసింది. కోర్టు రూమ్‌లో కాల్పులు దేశవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. పొరుగు దేశాల్లోని ముఠాలే ఇటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని ప్రజా భద్రతా వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవి సెనివిరాత్నె శనివారం మీడియాతో అన్నారు. దేశంలో అశాంతి సృష్టించాలనుకునేవారిని విడిచిపెట్టేది లేదని, అందుకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 2019 ఏప్రిల్ 21న 9 ఆత్మాహుతి దాడులు దేశవ్యాప్తంగా జరిగాయి. 11మంది భారతీయులతో సహా 273మంది చనిపోయారు. దేశంలో విలాసవంతమైన హొటళ్లపై, చర్చిలపై ఈ దాడులు జరిగాయి.

టన్నెల్‌లో ప్రాణాలు

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ చేసి ఈ సంఘటనపై ఆరా తీశారు. రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి మేరకు ఆర్మీని పంపేందుకు అంగీకరించారు. కేంద్రం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

సంఘటన దురదృష్టకరం : మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

ఎస్‌ఎల్‌బిసి టన్నెల్‌లో ఈ తరహా సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. సంఘటనా స్థలిని పరిశీలించిన అనంతరం అధికారులతో వీరు సమీక్షించారు. రాబిన్ సంస్థకు చెందిన లెన్ మైనార్డ్ కూడా హాజరయ్యారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందినీ సురక్షితంగా కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే సింగరేణికి చెందిన రిస్క్యూ టీములు రంగంలోకి దిగాయని, ఆర్మీకి చెందిన రిస్క్యూ టీము చేరుకుంటుందని వెల్లడించారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ తరహా సంఘటన చోటు చేసుకున్నప్పుడు ప్రాణాపాయం లేకుండా కాపాడిన టీమును కూడా రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిలో ప్రాజెక్ట్ ఇంజనీర్, సైట్ ఇంజనీర్‌తో పాటు ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు వర్కర్లు ఉన్నారని ఆయన వివరించారు



టన్నెల్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు

ముఖ్యమంత్రిదే బాధ్యత : కెటిఆర్

ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. సుంకిశాలలో రిటైనింగ్ వాల్ కుప్పకూలిన ఘటన మరువకముందే రాష్ట్రంలో మరో దుర్ఘటన జరగడం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శమని పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి : తెలంగాణ సిపిఎం

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా నీరు లీకేజీ అవుతున్నా అప్రమత్తంగా ఉండాల్సిన ప్రభుత్వం ఎలాంటి రక్షణ చర్యలూ తీసుకుండా టన్నెల్ పనులు చేపట్టిందని విమర్శించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

భారత జాలర్లకు ఉపశమనం

- పాక్ జైలు నుంచి 22 మంది విడుదల

న్యూఢిల్లీ : పాకిస్థాన్ కరాచీలోని మాలిర్ జైలులో ఉన్న 22 మంది భారతీయ జాలర్లకు ఉపశమనం లభించింది. వారు జైలు నుంచి విడుదలయ్యారు. మత్స్యకారుల విడుదలపై మాలిర్ జైలు సూపరింటెండెంట్ అర్షద్ షా మీడియాకు సమాచారం ఇచ్చారు. ఈదీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఫైసల్ ఈదీ జాలర్లు లాహోర్‌కు చేరుకునేందుకు ఏర్పాట్లు చేశారు. జాలర్లను పాక్ అధికారులు వాఘా సరిహద్దుకు తీసుకువచ్చి.. అక్కడ భారత అధికారులకు అప్పగించే ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ తర్వాత భారత అధికారులు వారిని సొంత ఊర్లకు పంపేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ఏడాది జనవరి 1న ఇరు దేశాలు ఖైదీల జాబితాను మార్పిడి చేసుకున్నాయి. ఈ జాబితా మేరకు.. పాకిస్థాన్‌లో 266 మంది భారతీయ ఖైదీలు ఉండగా.. ఇందులో 217 మంది జాలర్లు ఉన్నారు. భారత్‌లో 81 మంది జాలర్లు సహా 462 మంది పాక్ ఖైదీలు ఉన్నారు. శ్రీలంక జైళ్లలో మగ్గుతున్న జాలర్లను విడిపించేందుకు చర్యలు తీసుకోవాలని తమిళనాడు సిఎం స్టాలిన్ కేంద్రాన్ని కోరారు.

గండుచీమ- తాబేలు



కొన్ని చెట్లు, పొదలు ఉన్న చోట, ఒక గండుచీమ చిన్న పుట్టను పెట్టి అందులో పిల్లలతో హాయిగా ఉండసాగింది. గండుచీమ ఎప్పుడూ కొన్ని రోజులకు సరిపడా ఆహారాన్ని దాచి పెడుతుంది. అయితే ఒకసారి రెండు వారాల పాటు వర్షం కురుస్తూనే ఉంది. దాచిన ఆహారం అయిపోయింది. తిండి కోసం పిల్లలు అల్లాడిపోతారని గండు చీమ తెగ బాధపడింది.

వర్షం కాస్త తెరిపిచ్చింది, కానీ చుట్టూ నీళ్లు పారుతున్నాయి. గండుచీమ పిల్లలకు ధైర్యం చెప్పి నీళ్ల ప్రవాహంలో కొట్టుకొస్తున్న ఒక ఆకుపై దూకింది. పల్లం వైపు ఆకు కొట్టుకు పోయింది. ఒక చోట ఎత్తుగా ఉన్న చోటున ఆకు ఆగింది. గండు చీమ వెంటనే పక్కనే ఉన్న గట్టు మీదకి దూకింది. గట్టు మీద దొరికిన ఆహారం నోట కరుచుకుని మళ్లీ ఆకు కోసం నిలబడింది. అప్పుడు ఆ నీళ్లల్లో ఓ తాబేలు రావడం చూసింది.


'తాబేలు బావా! నాకోసాయం చేయవా!' అంది గండుచీమ. 'ఓ చేస్తాను ఎంటో చెప్పు' అంది తాబేలు. 'నేను పుట్ట నుంచి రావడం అయితే వచ్చాను కానీ ఈ ఆహారం తీసుకుని ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు' నువ్వు కొంచెం సాయం చెయ్యి. నేను నీ మీదకి ఎక్కి కూర్చొంటాను. నన్ను పుట్ట దగ్గరకి చేర్చు' అంది. 'సరే అలాగే చేరుస్తాను. అయితే ఒక్కసారి తీసుకెళ్లిన ఆహారం నీ పిల్లలకు ఎలా సరిపోతుంది? కాబట్టి నీతో పాటు నేను కూడా ముందుకి, వెనక్కి వస్తాను. అయితే వచ్చేటప్పుడు నువ్వు ఎలాగోలా ఇక్కడికి వచ్చేయ్. ఆహారం వెతుక్కునే లోపు నిదానంగా నేను వస్తాను. నిన్ను పుట్ట దగ్గరికి చేరుస్తాను. సరేనా' అంది. తాబేలు మాటలకు గండుచీమ ఎంతో సంతోషించింది.

నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చే ఆకులపై తేలుతూ గండుచీమ, వెనుక నిదానంగా తాబేలు ఆహారం ఉన్న ప్రాంతానికి చేరుకోవడం, తిరిగి పుట్ట దగ్గరకు చేర్చడం చేశాయి. సమృద్ధిగా ఆహారం సేకరించిన తరువాత, గండుచీమ, పిల్లలు, తాబేలుకు కృతజ్ఞతలు చెప్పాయి.


– యు.విజయశేఖర రెడ్డి, హైదరాబాద్.

తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఏడు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ





– ఎం.చరణ్,
7వ తరగతి,
ఎస్.కె.వి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
రాజమహేంద్రవరం.



JEEVANA జీవన the family

ఆదిమ భాషలకు అక్షరాలు సృష్టించారు!





'చదువు.. మనిషిని ఉన్నతీకరించాలి. అప్పడే సమాజంలో కులం పేరుతో, జాతి పేరుతో జరుగుతున్న వివక్ష మాయమవుతుంది. ఇప్పుడు మనం మోడరన్ ఆటవిక సమాజంలో ఉన్నాం. ఇక్కడ ఏళ్లకు ఏళ్లుగా వివక్ష రాజ్య మేలుతోంది. ఎన్నాళ్లీ పరిస్థితి? ఆ పరిస్థితి మారాలన్నదే నా ఆకాంక్ష. నేను నడిచిన ఈ దారి ఇంతకు ముందు నాలాంటి ఎందరో నడిచినదే. ఈ దారంతా వివక్షతో నిండి పోయింది. ఇప్పుడు నేను సాధించిన ఈ విజయం నాకు సంతోషంగానూ, బాధ గానూ ఉంది' అంటున్నారు రాజమహేంద్ర వరం నన్నయ్య యూనివర్శిటీ ఉపసంచాల కులు (వి.సి) ఎస్.ప్రసన్న శ్రీ. ఆమె మాటల్లో ఇంత ఆవేదన పలకడం వెనుక బలమైన కారణం ఉంది. ఆమె గిరిజన మహిళ. 'మీకు చదువెందుకు దండగ' అన్న సమాజం, తల ఎత్తి చూసేంత ఉన్నత స్థాయికి రావడం వెనుక ఆమె చేసిన కృషి వెలకట్టలేనిది. ఆదిమ భాషలకు లిపిని రూపొందించి, ఆమె ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ప్రసన్న శ్రీ అమ్మమ్మ గారి ఊరు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలంలోని సీతానగరం. తండ్రి ఊరు స్టువర్టుపురం. తాత వీరేశం పంతులు స్టువర్టుపురం స్కూల్లో హెడ్‌మాస్టారు. ప్రసాదరావు, వసుంధర దంపతుల ముగ్గురు బిడ్డల్లో ప్రసన్న తొలి సంతానం. ప్రసాదరావు రైల్వేలో వైద్యాధికారిగా పనిచేసేవారు. ఉద్యోగరీత్యా ఆయన 15 ఏళ్లకే సొంత ఊరు వదిలిపెట్టారు. చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా ఉండే ప్రసన్న మేడమ్ ప్రాథమిక విద్య బీహార్, కలకత్తా, మహారాష్ట్ర వంటి వివిధ రాష్ట్రాల్లో సాగింది. విజయవాడ పూర్ణానంద పేట రైల్వే స్కూల్లో ఉన్నతవిద్య అభ్యసించారు. ఆ తరువాత చిట్టినగర్ కేబీఎన్ కాలేజీలో ఇంటర్ చదివారు. మాంటిస్సోరీ కాలేజీలో డిగ్రీ పూర్తవ్వడంతోనే తెలంగాణలో బ్యాంకు ఉద్యోగం వచ్చింది. కానీ తల్లి వసుంధర ప్రోత్సాహంతో మరింత ఉజ్వల భవిష్యత్తు కోసం ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఎ ఇంగ్లీష్ లిటరేచర్ పూర్తిచేశారు.

తరువాత తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటీలో 'ఉమెన్ ఇన్ ద నావెల్స్ ఆఫ్ శశిదేశ్‌పాండే'పై పిహెచ్‌డి పూర్తిచేశారు. 1987లో అదే యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ బాధ్యతల్లో ఉన్నారు. తాజా నియామకాల్లో వీసీ పదవికి అర్హత సాధించి రాజమండ్రికి చేరుకున్నారు. ప్రొఫెసర్‌గా 38 ఏళ్లుగా ప్రసన్నశ్రీ సాగించిన ప్రస్థానం చరిత్రలో ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేసింది.

'చదువు మనిషికి ఒక ఆభరణంలా ఉండాల'ంటారు ప్రసన్న శ్రీ. తనని తాను గుర్తించేలా చదువుకోవాలి. విద్య అర్హత కోసమే కాదు, ఆత్మవిశ్వాసం పెంచేదిగా ఉండాలి. మనిషిని మనిషిగా చూడాలి. చదువుకోవడం తమ ఆలోచనల్లో కూడా రాని సమాజాలు చాలా ఉన్నాయి. ఎక్కడో కొండల్లో, కోనల్లో, అడవుల్లో ఉండే సమూహాలు అవి. అనాదిగా వస్తున్న సంస్కృతిని కాపాడుకుంటూ, సాంప్రదాయాలని గౌరవిస్తూ అక్కడ ఎంతో ఉన్నతంగా జీవిస్తారు. కానీ వారు ఈ బాహ్య ప్రపంచంలోకి వచ్చినప్పుడు ఇక్కడ వారికి సముచిత స్థానం దొరకదు. అసలు వాళ్లని మనుషులుగానే చూడరు. మనిషి రూపంలో ఉన్న జంతువులుగా వాళ్లని లెక్కేస్తారు. వాళ్లు చెప్పేది ఇక్కడి వాళ్లకి అర్థం కాదు. వీళ్లు చెప్పేది వాళ్లకి తెలియదు. తమ గోడు వెల్లబోసుకుంటున్నా ఆ భావాన్ని అర్థం చేసుకునే భాష లేకపోవడమే దీనికంతటికీ కారణం. అందుకే వాళ్ల భాషని సజీవంగా ఉంచాలనుకున్నాను. ఇది పెద్ద సాహసంతో కూడుకున్న పని. ఎంతో కష్టతరమైన ప్రయాణం. ఈ దారిలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. అయినా వెనుకడుగు వేయలేదు' అంటున్న ప్రసన్న బగత, గదబ, కొలామి, కోయ, పోర్జ, జాతపు, కోలం, కొండదొర వంటి 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించారు.

1957 తరువాత ఆంధ్రప్రదేశ్‌లో యూనివర్శిటీ వీసీగా ఎంపికైన తొలి గిరిజన మహిళ ప్రసన్న శ్రీ. ఫిబ్రవరి 20 గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆమె, తనని కలిసేందుకు వస్తున్న వారికి ఒక విన్నపం చేశారు. 'బహుమతులు, లంచాలు ఇచ్చే వాళ్లెవరూ ఇక్కడికి రావద్దు. తీసుకునేవాళ్లు ఇక్కడ ఉండొద్దు. నేనున్నంతవరకు ఆ విధానం కొనసాగుతుంది' అన్నారు.

బోధన నా పాషన్..

'బోధనా వృత్తి నా అభిరుచి. కష్టంగా కాదు, ఇష్టంగా దీన్ని స్వీకరించాను. అమ్మగా ఇంటినే బాగు చేయగలను. టీచర్‌నైతే సమాజాన్ని చైతన్యం చేయగలను. ఆ గురుతర బాధ్యత టీచర్లకే ఉంటుంది. తల్లి తొలి గురువు అయితే టీచర్ సమాజాన్ని పరిచయం చేస్తారు. మంచి, చెడులను విశదపరుస్తారు. పాఠ్యగ్రంథాలతో పాటు జీవితపాఠాలు నేర్పిస్తారు. నేను నా విద్యార్థులకు క్లాసు రూం పాఠాలతో పాటు వివక్షకి వ్యతిరేకంగా సమానత్వ పాఠాలను బోధించాను.

చదువే ఆస్తి అన్నాను



'మనకు తాతలు సంపాదించిన ఆస్తులు లేవు. చదువే మనకు ఆస్తి' అని పిల్లలకు చెప్పేదాన్ని. ఉద్యోగరీత్యా ఆయన తీరిక లేకుండా గడుపుతుంటే పిల్లలను చదివించడం నా బాధ్యతగా తీసుకున్నాను. ప్రసన్నకి ఎలిమెంటరీ చదువంతా నేనే నేర్పాను. కొత్త విషయాలు నేర్చుకోవడం, పరిశోధించడం తనకి చాలా ఇష్టం. గిరిజన భాషలకి లిపి తయారుచేసేటప్పుడు ఎంతో కష్టపడింది. 'ఎందుకమ్మా అంత కష్టం?' అంటే 'అదే నాకు ఇష్టమమ్మా' అని చెప్పేది. మొదట్లో వాళ్ల నుంచి వ్యతిరేకత ఎదురైంది. నిదానంగా వారు ప్రసన్నని అర్థం చేసుకున్నారు. అప్పుడు తను చాలా సంతోషపడింది. వీసీగా బాధ్యతలు తీసుకున్నదని తెలిసి చాలా సంతోషపడ్డాను. నా బిడ్డ ఈ స్థాయికి వస్తుందని ముందే ఊహించాను. నా నమ్మకం వమ్ము కాలేదు' అంటున్నారు ప్రసన్న తల్లి వసుంధర. ప్రస్తుతం ఆమె తన స్వగ్రామం సీతానగరంలోనే ఉంటున్నారు.

చదువు అజ్ఞానాన్ని పారద్రోలి, విజ్ఞానదారులను ఏర్పరుస్తుంది. షెడ్యూల్ కులాలు, తెగలు, గిరిజనులు, ఆదివాసీలు అందరికీ విద్య అందాలి. వారు విజ్ఞానవంతులై బతుకులు బాగు చేసుకోవాలి. అందుకే నేను వాళ్ల భాషని బతికించాను. ఆ భాషని విశ్వ వ్యాపితం చేయడం నా తరువాతి తరం వాళ్లు చేయాల్సిన పని. అది జరిగినప్పుడే నా కృషికి తగిన గుర్తింపు' అంటున్నారు ప్రసన్నశ్రీ.

– జ్యోతిర్మయి

మార్గనిర్దేశకులు గురువులు

విజయవాడలో తన విద్యాభ్యాసం, విద్య నేర్పిన గురువుల గురించి ప్రసన్న శ్రీ ఇప్పటికీ మర్చిపోలేదు. కేబీఎన్ కాలేజీలో చదివేటప్పుడు స్టేట్ బెస్ట్ ఉమెన్ స్పీకర్ అవార్డు తీసుకున్నాను. మాంటిస్సోరి కాలేజీలో స్టూడెంట్ యూనియన్ సెక్రటరీగా ఉన్నప్పుడు మాట్లాడడం నేర్చుకున్నాను. కోటేశ్వరమ్మ గారు, సుదర్శన మేడమ్, దేవకీ దేవి నాకు మెంటార్లు. రైల్వే స్కూల్ ప్రిన్సిపల్ సుచరిత మేడమ్, టీచర్లు సాంబమూర్తి మాస్టారు, గోపాలకృష్ణ మాస్టారు నాకు ఇప్పటికీ బాగా గుర్తు. అక్షరాలు నేర్పించిన ఆనందిబాయి మేడమ్‌ని ఎప్పటికీ మర్చిపోను. ఇంటర్‌లో ఫిజిక్స్ మాస్టారు కృష్ణమూర్తి, విజెఎంఆర్, సోమయాజులు నా భవిష్యత్తుని తీర్చిదిద్దినవారిలో ఉన్నారు' అని చెప్పారు.

అవార్డులు, ప్రశంసలు

ప్రసన్న శ్రీ రూపొందించిన లిపులకు గూగుల్ కూడా ప్రత్యేక స్థానమిచ్చింది. అంతరిస్తున్న భాషల అట్లాస్‌ని రూపొందించిన భారతీయురాలిగా 2024లో అమెరికా వర్మోంటాలోని ఎన్‌డేంజడ్ ఆల్ఫాబెట్ అనే సంస్థ ప్రకటించిన అవార్డు ప్రసన్న మేడమ్‌కి దక్కింది. దీన్ని సాధించిన ఏకైక భారతీయ మహిళ ఆమె. ఓడిఎ ప్రాజెక్టు యుకెలోని మాంచెస్టర్ యూనివర్శిటీ, ప్రిన్స్‌టన్‌లో ఉన్న అడ్వాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ సెమిటిక్ అండ్ ఆఫ్రో ఏషియాటిక్ స్టడీస్, అలాగే ఆస్ట్రేలియా, జపాన్, యుథోఫియా, ఆఫ్ఘనిస్తాన్ నుండి కూడా అవార్డులు, ప్రశంసా పత్రాలు వచ్చాయి. 2022లో భారత ప్రభుత్వం ఆమెని 'నారీశక్తి' అవార్డుతో గౌరవించింది. ఆమె రచించిన 143 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 56 పిహెచ్‌డీలు, ఎంఫిల్‌లకు మార్గనిర్దేశం చేశారు. 32 పుస్తకాలు రచించారు.




తెలుగులో 'హిచ్‌కాక్' రావటం అభినందనీయం : చిరంజీవి

ప్రపంచ సినిమాపై తనదైన ముద్ర వేసిన దర్శకుల్లో ఒకరైన ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ పేరుతో తెలుగులో పుస్తకం రావటం అభినందనీయమని టాలీవుడ్ అగ్రనటుడు చిరంజీవి అన్నారు. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 125వ జయంతి సందర్భంగా, ఆయన తొలి సినిమా విడుదలై వందేళ్లు పూర్తయిన సందర్భంగా హిచ్‌కాక్ జీవితంపై 'మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ హిచ్‌కాక్' పేరుతో సీనియర్ జర్నలిస్ట్, సినీ రచయిత పులగం చిన్నారాయణ ఐఆర్‌టిఎస్ అధికారి రవి పాడితో కలిసి ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు. డిసెంబర్ 18న మొదటి ప్రచురణ విడుదలైంది. ఐదురోజుల్లో పుస్తకాలన్నీ అమ్ముడు పోవటంతో సరికొత్త చేర్పులతో ద్వితీయ ముద్రణను తీసుకొచ్చారు. ఈ పుస్తకాన్ని చిరంజీవి ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగులో ఇలాంటి పుస్తకం తీసుకురావటం అభినందనీయమన్నారు. హిచ్‌కాక్ సినిమాలు కొన్నింటినీ తాను కాలేజీకి వెళ్లే రోజుల్లో చూశానన్నారు. ఈ పుస్తకాన్ని ఖాళీ సమయం దొరికినప్పుడల్లా 10 నుంచి 15 రోజుల్లో చదివేస్తానన్నారు.

'లూసిఫర్ 2'లో నిఖాత్‌ఖాన్‌హెగ్డే



మలయాళ స్టార్ మోహన్‌లాల్ కథా నాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్ 2' : ఎంపురాన్ (రాజు కన్నా గొప్పవాడు)'. ఈ మూవీలో బాలీవుడ్ కథా నాయకుడు అమీర్‌ఖాన్ సోదరి నిఖాత్‌ఖాన్ హెగ్డే ఓ కీలకపాత్రలో నటించనున్నారు. దక్షిణాది సినిమాల్లో ఆమె నటించటం ఇదే మొదటిసారి. ఈ మేరకు ఆమె తాజాగా ఒక వీడియోతో ఈ సినిమా గురించి పలు విషయాలు తెలిపారు. సుభద్రాబెన్ పాత్రలో ఆమె కనిపించనున్నారు. 2019లో వచ్చిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'లూసిఫర్' చిత్రానికి ప్రీక్వెల్‌గా పార్ట్2ను మేకర్లు తెరకెక్కించారు. మిషన్ మంగళ్ (2019) సినిమాతో నిఖాత్‌ఖాన్ హెగ్డే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. తన సోదరుడు అమీర్‌ఖాన్ నటించిన లగాన్ (2001) సినిమాకు ఆమె నిర్మాతగా వ్యవహరించారు. లూసిఫర్ 2 సినిమాను లైకా ప్రొడక్షన్స్ ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్లపై సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.



ఓదెల 2 టీజర్ విడుదల

ఓదెల రైల్వే స్టేషన్ (2021)కి సీక్వెల్‌గా ఓదెల 2 సినిమా తెరకెక్కుతోంది. తమన్నా ప్రధాన పాత్రలో నటించగా, హెబ్బా పటేల్, వశిష్ట కీలక పాత్రలు పోషిస్తున్నారు. తొలి భాగాన్ని తెరకెక్కించిన అశోక్ తేజ రెండో భాగానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి.మధు నిర్మిస్తున్నారు. సాగసాధువుగా తమన్నా ప్రధాన పాత్రలో నటించారు.

సరికొత్తగా 'జిగేల్'

సరికొత్త ప్రేమ కథతో 'జిగేల్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు మల్లి యేలూరి తెలిపారు. రెండున్నర గంటలపాటు మంచి వినోదాన్ని పొందొచ్చుననీ, ప్రొడక్షన్ విషయంలో ఎక్కడా రాజీ పడలేదని నిర్మాతలు తెలిపారు. షియాజీ షిండే, పోసాని, రఘుబాబు, పృథ్వీరాజ్ తదితరులు నటించిన ఈ సినిమాకు ఆనంద్ సంగీతాన్ని అందించారు. త్రిగుణ్, మేఘాచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డాక్టర్ వైఎస్ జగన్మోహన్, నాగార్జున అల్లం నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తోపాటుగా కొన్ని లిరికల్ వీడియోలు విడుదలయ్యాయి. మార్చి 7న ఈ సినిమా విడుదల కానుంది.



'నారి' ఓ మంచి ప్రయత్నం : దిల్‌రాజు



'మహిళల గురించి ఒక మంచి కథతో 'నారి' సినిమాను రూపొందించినట్లు ట్రైలర్‌తో తెలుస్తుంది. ట్రైలర్ చాలా బాగుంది. కొత్త ప్రొడ్యూసర్, డైరెక్టర్ ఇలాంటి మంచి ప్రయత్నం చేయడం సంతోషకరం. ఆమని గారు మావిచిగురు, శుభలగ్నం లాంటి మూవీస్‌తో తెలుగు ప్రేక్షకులకు గుర్తిండిపోయారు. మా సంస్థలో ఎంసిఎ, శ్రీనివాస కళ్యాణం మూవీస్‌లో నటించారు. 'నారి' సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని ఈ టీమ్‌కు సజెస్ట్ చేస్తున్నా. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్' అని నిర్మాత దిల్‌రాజు అన్నారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికరెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదినీ తదితరులు కీలక పాత్రల్లో నటించిన సినిమా 'నారి'. 'మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి' అనే కాన్సెప్ట్‌తో దర్శకుడు సూర్య వంటిపల్లి ఈ చిత్రాన్ని రూపొందించారు. నిర్మాతగా శశి వంటిపల్లి నిర్మించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి ఏడోతేదీన ఈ సినిమాను విడుదల చేయనున్నారు. శనివారంనాడు ట్రైలర్‌ను దిల్‌రాజు విడుదల చేశారు.

బిగ్ ఫైట్

- నేడు భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య కీలకపోరు
- మ.2.30గం॥ల నుంచి



దుబాయ్: భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య హై-వోల్టేజ్ క్రికెట్ మ్యాచ్‌కు సమయం ఆసన్నమైంది. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాకిస్తాన్ చేతిలో ఓటమికి ఇన్నాళ్లకు బదులుకు తీర్చుకునేందుకు టీమిండియాకు సదవకాశం దక్కింది. ఆ ఏడాది జరిగిన ఫైనల్లో పాకిస్తాన్ జట్టు 338పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 158పరుగులకే కుప్పకూలింది. దీంతో ఎనిమిదేళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్తాన్‌పై సమిష్టిగా కదం తొక్కాల్సిన సమయం ఆసన్నమైంది. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా తొలి మ్యాచ్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేయగా... ఆతిథ్య పాకిస్తాన్ జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 60పరుగుల తేడాతో పరాజయం పాలైంది. దీంతో ఈ మ్యాచ్ గెలుపు భారత్‌కంటే పాకిస్తాన్‌కే కీలకంగా మారింది. ఒకవేళ పాకిస్తాన్ జట్టు భారత్ చేతిలో ఓటమిపాలైతే.. ఆ జట్టుకు సెమీస్ దారులు మూసుకుపోయినట్లే. మరోవైపు భారతజట్టు ఈ మ్యాచ్‌లో గెలిస్తే సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోనుంది. పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చే ఛాంపియన్స్ ట్రోఫీకి దౌత్యపరమైన ఉద్రిక్తతల కారణంగా భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఇక పాకిస్తాన్ జట్టు ఓపెనర్ ఫకర్ జమాన్ గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ సందర్భంగా ఫకర్ చీలమండ గాయానికి గురయ్యాడు.

భారత్‌దే పై చేయి..

ఐసిసి టోర్నమెంట్లలో పాకిస్తాన్‌పై భారత్‌కు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. ఇరుజట్లు ముఖాముఖి 21మ్యాచ్‌ల్లో తలపడగా.. 16మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించగా, పాక్ కేవలం ఐదింట మాత్రమే గెలుపొందింది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఓవరాల్‌గా వన్డే క్రికెట్‌లో అయితే భారత్‌పై పాక్ పై చేయి సాధించింది. ఈ మెగా టోర్నీలో ఇరుజట్లు ఇప్పటివరకు ఐదు సార్లు తలపడగా.. పాక్ 3, భారత్ 2 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. వన్డే ఫార్మాట్‌లో పాకిస్తాన్, ఇండియా ఇప్పటివరకు 153 సార్లు తలపడ్డాయి. ఇందులో పాకిస్తాన్ 73సార్లు భారత్‌ను ఓడించగా.. భారత్ 57 సార్లు విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌లు ఫలితం లేకుండా ముగిశాయి.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, శ్రేయాస్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), అక్షర్, హార్దిక్, జడేజా, షమీ, అర్ష్‌దీప్, వరుణ్.

పాకిస్తాన్: రిజ్వాన్(కెప్టెన్, వికెట్ కీపర్), ఇమామ్ ఉల్ హక్, బాబర్, సౌద్ షకీల్, సల్మాన్ అఘా, తయ్యబ్ తాహిర్, ఖుష్దిల్ షా, షాహీన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్, అబ్రార్.

ఆసీస్ బ్యాటర్స్ అదుర్స్

- ఇంగ్లిస్ సెంచరీ, క్యారీ, షార్ట్ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌పై భారీ లక్ష్యాన్ని ఛేదించిన కంగారులు



లాహోర్: ఛాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియా జట్టు ఇంగ్లండ్ నిర్దేశించిన 352 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 351 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆస్ట్రేలియా జట్టు 47.3ఓవర్లలో కేవలం 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లిస్(120నాటౌట్)కి తోడు షార్ట్, క్యారీ అర్ధసెంచరీలతో రాణించారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఫిల్ సాల్ట్(10), జేమీ స్మిత్(15) త్వరగానే పెవిలియన్ చేరడంతో ఇంగ్లండ్ 43 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రూట్‌తో కలిసి డకెట్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. ఈ జోడి మూడో వికెట్‌కు 158పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. డకెట్ 143బంతుల్లో 17ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 165 పరుగులు చేసి లబూషేన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. జో రూట్ (68; 78బంతుల్లో 4ఫోర్లు) అర్ధసెంచరీతో మెరిసాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో డ్వార్సిస్‌కు మూడు, ఆడమ్ జంపా, లబుషేన్‌కు రెండేసి, మ్యాక్స్‌వెల్ ఒక వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా ఓపెనర్ హెడ్(6), కెప్టెన్ స్మిత్(5) నిరాశపరిచినా.. షార్ట్(63) అర్ధసెంచరీతో మెరిసాడు. లబూషేన్ (45)కి తోడు ఇంగ్లిస్(120 నాటౌట్; 86బంతుల్లో 8ఫోర్లు, 6సిక్సర్లు) ఇంగ్లండ్ బౌలర్లను చితక్కొట్టాడు. మరోవైపు క్యారీ(69; 63బంతుల్లో 8ఫోర్లు) కూడా మెరవడం... చివర్లో మ్యాక్స్‌వెల్(32; 15బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్ తోడైంది. దీంతో ఆసీస్ జట్టు మరో 15బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఇంగ్లండ్ బౌలర్లలో వుడ్, ఆర్చర్, కర్సె, రషీద్, లివింగ్‌స్టోన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇంగ్లిస్‌కు దక్కింది.

ఛాంపియన్స్ ట్రోఫీ పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ	ఆ	గె	ఓ	పా	నె.ర.
న్యూజిలాండ్	1	1	0	2	+1.20
భారత్	1	1	0	2	+0.40
బంగ్లాదేశ్	1	0	1	0	+0.40
పాకిస్తాన్	1	0	1	0	+1.20
గ్రూప్-బి					
దక్షిణాఫ్రికా	1	1	0	2	+2.14
ఆస్ట్రేలియా	1	1	0	2	+0.47
ఇంగ్లండ్	1	0	1	0	-0.47
ఆఫ్ఘనిస్తాన్	1	0	1	0	-2.14



హిప్.. హిప్.. హెన్రీ

- 23బంతుల్లో 62పరుగులు
- ఢిల్లీ క్యాపిటల్స్‌పై యుపి వారియర్స్ గెలుపు

బెంగళూరు: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై యుపి వారియర్స్ 33 పరుగుల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 177పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ జట్టు 19.3ఓవర్లలో 144పరుగులకే కుప్పకూలింది. ఢిల్లీ జట్టులో జెమిమా రోడ్రిగ్స్(56), షెఫాలీ వర్మ(24) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. యుపి బౌలర్లు క్రాంతి గాడ్, హారీస్‌కు నాలుగేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు యుపి బ్యాటర్ ఛిన్నెల్లె హెన్రీ కేవలం 23బంతుల్లోనే 2ఫోర్లు, 8సిక్సర్లతో 62పరుగులు చేయడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 177పరు గుల భారీస్కోర్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెన్రీకి దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68